ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
శనివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 31.4, కనిష్ఠం 15.5
నిజామాబాద్
జిల్లా వార్తలు
5
ఆదివారం 24 నవంబరు 2024





స్వీట్లు తినిపించుకుంటున్న ధన్‌పాల్, బీజేపీ నేతలు

మహాయుతి గెలుపు సంబరాలు

- నగరంలో స్వీట్లు పంచిపెట్టిన బీజేపీ నాయకులు
- కాంగ్రెస్ గ్యారంటీల మోసానికి మరాఠా ప్రజలు బుద్ధి చెప్పారు: అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

సుభాష్‌నగర్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్రలో మహాయుతి గెలుపుతో బీజేపీ నాయకులు సంబరాలు చేసుకున్నారు. నగరంలోని బీజేపీ కార్యాలయంలో సంబరాలు చేసుకున్నారు. అనంతరం నగరంలోని నిఖిల్‌సాయి చౌరస్తా వద్ద బాణాసంచా పేల్చి ఒకరినొకరు స్వీట్లు తినిపించుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ గ్యారంటీల మోసానికి మరాఠా ప్రజలు తగిన బుద్ధి చెప్పారని అన్నారు. మోదీ నాయకత్వంలోని బిజెపితోనే అభివృద్ధి సాధ్యమని మరాఠా ప్రజలు డబుల్ ఇంజన్ సర్కార్‌ను కోరుకున్నారని హర్షం వ్యక్తం చేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో బిజెపి అధికారంలోకి వస్తే రిజర్వేషన్లు రద్దు చేస్తుందన్న అబద్ధపు ప్రచారం చేసి కుట్ర చేసిన కాంగ్రెస్‌కు అసెంబ్లీ ఎన్నికల్లో మహారాష్ట్ర ప్రజలు తగిన బుద్ధి చెప్పారన్నారు. ఈవీఎంల గోల్‌మాల్ జరిగిందని కాంగ్రెస్ అనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. తెలంగాణ నుంచి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రచారానికి పోయిన ఒక్కస్థానంలో కూడా కాంగ్రెస్ కూటమి గెలవలేదన్నారు. మహారాష్ట్ర ఎన్నికల ఫలితాల్లో తెలంగాణపై ప్రభావం చూపుతుందన్నారు. రేవంత్‌కు మహారాష్ట్ర ఎన్నికల ఫలితాలతో కుర్చీ భయం పట్టుకుంటుందన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలు అమలుచేయకపోతే వచ్చే స్థానిక కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఓడగొట్టడం ఖాయమన్నారు. కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యదర్శి పల్లెగంగారెడ్డి, పార్లమెంట్ కన్వీనర్ గడ్డెభూమన్న, అధ్యక్షుడు దినేష్, కార్పొరేటర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్‌లో వసతులు మెరుగుపర్చాలి

- వ్యవసాయ మార్కెట్ శాఖ జాయింట్ డైరెక్టర్ మల్లేశం

ఖిల్లా, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటైన హోల్‌సేల్ మార్కెట్ యార్డ్‌లో వ్యాపారులకు, రైతులకు మెరుగైన వసతులు కల్పించాలని వ్యవసాయ మార్కెట్ శాఖ జాయింట్ డైరెక్టర్ మల్లేశం అన్నారు. నెలవారి సమీక్షలో భాగంగా శనివారం ఆయన జిల్లా కేంద్రంలోని శ్రద్ధానంద్‌గంజ్ కూరగాయల మార్కెట్‌ను సెలక్షన్‌గ్రేడ్ కార్యదర్శి అపర్ణ, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్పాగంగారెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వసతులపై ఆరా తీశారు. సమస్యలుంటే వివరించాలని వ్యాపారులను, రైతులను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా నూతనంగా నిర్మించబోయే షాపులకు స్థలాన్ని పరిశీలించారు. ఆయనవెంట ఈఈ గణేష్, కార్యదర్శి ఖాదర్, సిబ్బంది ఉన్నారు.



మార్కెట్‌యార్డ్‌లో స్థల పరిశీలన చేస్తున్న జాయింట్ డైరెక్టర్



ఆంధ్రజ్యోతి ఫోకస్

- ఏళ్లు గడుస్తున్నా లబ్ధిదారులకు ఇళ్ల కేటాయింపులపై నిర్ణయం తీసుకోని యంత్రాంగం
- ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక సమయంలోనే నిర్ణయం తీసుకోనున్న అధికారులు
- జిల్లాలో ప్రతీ నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపు
- జిల్లాలో మళ్లీ ఏర్పాటు కానున్న గృహ నిర్మాణ శాఖ

వృథాగా డబుల్ ఇళ్లు!

నిజామాబాద్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో నిరుపేదల కోసం నిర్మించిన డబుల్‌బెడ్‌రూం ఇళ్లు నేటికీ లబ్ధిదారులకు కేటాయించడం లేదు. ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల కింద లబ్ధిదారుని ఎంపిక చేయనుండటంతో అధికారులు వాటిపై ఫోకస్ పెట్టారు. డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం పూర్తై ఇళ్లు గడుస్తున్నా వాటి కేటాయింపులను చేయడం లేదు. మధ్యలో ఆగిపోయిన ఇళ్ల నిర్మాణం కూడా చేపట్టడం లేదు. ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు లేకపోవడం వల్ల ఈ ఇండ్లను పట్టించుకోవడం లేదు. జిల్లాలో ఇప్పటివరకు మంజూరై పనులు మొదలు పెట్టని ఇళ్లను కూడా రద్దు చేయనున్నట్లు తెలుస్తోంది. ఇందిరమ్మ పథకం కిందనే ఇళ్లను కేటాయించేందుకు నిర్ణయం తీసుకోవడంతో వాటిపైనే దృష్టిపెట్టిన అధికారులు నిబంధనలు వచ్చిన తర్వాత ఎంపిక చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే ఇందిరమ్మ కమిటీలను గ్రామాలు, మున్సిపాలిటీల వారిగా ఎంపిక చేసిన అధికారులు ప్రభుత్వం నుంచి వెలువడే నిబంధనల కోసం వేచి చూస్తున్నారు.

కేటాయింపులకు సిద్ధంగా ఉన్న 6,162

జిల్లాలో గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో డబుల్ బెడ్‌రూం ఇళ్లు మంజూరు చేశారు. జిల్లాలోని ఆరు నియోజకవర్గాల పరిధిలో మొత్తం 15,304 ఇళ్లను మంజూరు చేశారు. వీటిలో 12,908 ఇళ్లకు టెండర్లు పూర్తి చేశారు. వీటిలో 6,162 ఇళ్ల నిర్మాణాలను సైతం పూర్తిచేశారు. మిగతా ఇళ్ల నిర్మాణం వివిధ దశల్లో ఉన్నాయి. కొన్ని ఇళ్ల పూర్తయి కొద్ది మొత్తంలో పనులు ఉండగా, మరికొన్ని ఇళ్ల స్లాబ్ వేసి వదిలివేశారు. నిజామాబాద్ నగరంతోపాటు ఇతర నియోజకవర్గాల పరిధిలో నిర్మాణమైన ఇళ్లను కూడా లబ్ధిదారులకు అందించలేదు. కొన్ని నియోజకవర్గాల్లో ఎన్నికలముందు డబుల్‌బెడ్‌రూం ఇండ్లను లబ్ధిదారులకు అందించారు. మిగతా నియోజకవర్గాల పరిధిలో ఇబ్బందులు వస్తాయని వదిలివేశారు. ఏడేళ్ల క్రితం నిర్మాణం చేపట్టి పూర్తి చేసిన ఇండ్లు ప్రస్తుతం దెబ్బతిన్నాయి. లబ్ధిదారులకు కేటాయించకపోవడం వల్ల ఇండ్లలోని సామాగ్రిని కూడా ఎత్తుకెళ్లారు. నిజామాబాద్ నగరంతో పాటు వివిధ నియోజకవర్గాల్లో పూర్తయిన ఇళ్లను కేటాయించాలని పలుమార్లు పేదలతోపాటు వివిధ సంఘాల నేతలు అధికారులతో పాటు ప్రజాప్రతినిధులను కలిసి విజ్ఞప్తి చేశారు. నిర్మాణమైన ఇళ్లను మరమ్మతులు చేసి కేటాయించాలని కోరారు. కొత్త ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత మొదట కొంత కదలిక వచ్చిన తర్వాత పట్టించుకోవడం లేదు. వివిధ దశల్లో ఉన్న ఇండ్లకు కూడా నిధులను మంజూరు చేయలేదు. పూర్తయిన ఇళ్లను కేటాయింపు చేయలేదు. నిర్మాణంలో ఉన్న ఇళ్లపై కూడా ప్రభుత్వ స్థాయిలో నిర్ణయం తీసుకోకపోవడం వల్ల అన్నిచోట్ల ఆగిపోయాయి. ఇళ్లు ఖాళీగా ఉండటంతో పలుమార్లు వివిధ సంఘాల నేతలతోపాటు వామపక్ష పార్టీల నేతలు అధికారులకు ఫిర్యాదు చేస్తున్నారు. ప్రజాప్రతినిధులను కలుస్తూ ఇళ్ల కేటాయింపులకు చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లాలో రూ.335కోట్లతో నిర్మాణమైన ఇళ్లు సగం వరకు లబ్ధిదారులకు ఇచ్చినా మిగతా కేటాయింపులు చేయకపోవడంతో ప్రజాధనం వృథా అవుతోంది. పేదల కోసం నిర్మించిన ఇళ్లు వారికి చేరకుండానే శిథిలావస్థకు చేరేలా ఉన్నాయని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.



నాగారంలో నిర్మాణమై వృథాగా ఉన్న డబుల్ బెడ్‌రూం ఇళ్లు

ఇందిరమ్మ పథకంపైనే సర్కారు ఫోకస్

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం ఇందిరమ్మ ఇళ్ల పథకంపైనే ఫోకస్ పెట్టింది. ఎన్నికల సమయంలో హామీ ఇవ్వడంతో పాటు ప్రతీ నియోజకవర్గానికి 3500 ఇళ్లను మంజూరు చేసింది. ఇళ్ల స్థలాలు ఉన్నవారికి ఈ ఇళ్లను మంజూరు చేయడంతోపాటు రూ.5లక్షల నిర్మాణం కోసం ఇవ్వనున్నారు. మూడుదశల్లో అందించేందుకు ఏర్పాట్లను చేస్తున్నారు. ఈ ఇళ్ల లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు ఇప్పటికే గ్రామ, మున్సిపాలిటీ స్థాయిలో ఇందిరమ్మ కమిటీలను ఏర్పాటుచేశారు. కమిటీ సభ్యుల నియామకం చేశారు. ప్రభుత్వం నుంచి నిబంధనలు విడుదల చేయగానే ఇళ్ల కేటాయింపులకు అనుగుణంగా ఆయా నియోజకవర్గాల పరిధిలో లబ్ధిదారులను ఎంపిక చేయనున్నారు. ఇందిరమ్మ (...మిగతా 8వ పేజీలో)

పత్తి కొనుగోళ్లలో నిబంధనలకు నీళ్లు!

- లైసెన్స్ లేకపోయినా దర్జాగా దందా
- ఇష్టారాజ్యంగా కమీషన్ వసూలు
- నష్టపోతున్న రైతులు

7



సొంతూరిపై మమకారం.. అభివృద్ధికి సహకారం

- ఐలాపూర్ ప్రభుత్వ పాఠశాలను దత్తత తీసుకున్న పూర్ణచందర్ రెడ్డి
- సొంత ఖర్చులతో వంటశాల, మరుగుదొడ్లు
- గ్రంథాలయం ఏర్పాటుకు సన్నాహాలు

7



జిల్లాకు మూడు యంగ్ ఇండియా సమీకృత గురుకుల పాఠశాలలు

నిజామాబాద్ అర్బన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేయనున్న యంగ్ ఇండియా సమీకృత గురుకుల పాఠశాలలు రెండవ విడతలో జిల్లాకు మూడు మంజూరయ్యాయి. మొదటి విడతలో 28 అసెంబ్లీ నియోజకవర్గాలకు కేటాయించగా రెండో విడతలో రాష్ట్ర వ్యాప్తంగా 26 యంగ్ ఇండియా సమీకృత గురుకుల పాఠశాలలను మంజూరు చేస్తూ విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్ర వెంకటేశం ఉత్తర్వులు ఇచ్చారు. రెండవ విడత కింద జిల్లాలోని నిజామాబాద్ రూరల్, బోధన్, ఆర్మూర్ నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా సమీకృత గురుకుల పాఠశాలలు మంజూరు చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాల్లో ఈ యంగ్ ఇండియా సమీకృత గురుకుల పాఠశాలలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం గత నెలలో దసరా రోజున పలు నియోజకవర్గాల్లో భూమిపూజ కార్యక్రమాలు నిర్వహించారు. మొదటి విడతలో జిల్లాకు యంగ్ ఇండియా సమీకృత గురుకుల పాఠశాలలు మంజూరు కాకపోగా రెండో విడతలో జిల్లాకు మూడు నియోజకవర్గాల్లో మంజూరు కావడంతో విద్యార్థులు, విద్యావేత్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



నార్త్ తహసీల్దార్ కార్యాలయంలో అంతా గందరగోళం

- ఏ పని కావాలన్నా చేయి తడపాల్సిందే..
- యథేచ్ఛగా నాలా అనుమతులు

నిజామాబాద్ అర్బన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): నగరంలోని నార్త్ తహసీల్దార్ కార్యాలయం అక్రమాలకు అడ్డాగా మారింది. ఎన్నికలకు ముందు బదిలీలలో భాగంగా ఇక్కడికి వచ్చిన ఇతర జిల్లాల తహసీల్దార్లు జిల్లాలో ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారు. అందినకాడికి దండుకుంటూ నిబంధనలకు విరుద్ధంగా పనులు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. గత కొన్నినెలల క్రితం మాక్లూర్ తహసీల్దార్ అసైన్డ్ భూములకు పట్టాలు చేసిన ఆరోపణలపై భీంగల్‌కు బదిలీ చేశారు. సుమారు ఏడాదిన్నరకు పైగా ఇతర జిల్లాలకు చెందిన తహసీల్దార్లు జిల్లాలో పనిచేస్తూ అనేక ఆరోపణలను ఎదుర్కొంటున్నారు. ఖరీదైన స్థలాలు ఉన్న నిజామాబాద్ నార్త్, సౌత్, నిజామాబాద్ రూరల్ తహసీల్దార్ కార్యాలయాలు అక్రమాలకు అడ్డాలుగా మారాయన్న ఆరోపణలు ఉన్నాయి. ఇక్కడ ఏ పని కావాలన్న దానికి తగ్గట్టుగా సమర్పించుకుంటేనే పనులు అవుతున్నాయనే విమర్శలు ఉన్నాయి. చిన్న చిన్న సర్టిఫికెట్లతో మొదలుకొని నాలా అనుమతుల వరకు ఒకదానికి ఒక రేటు చొప్పున వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. మీసేవా కేంద్రాల నిర్వాహకులను మధ్యవర్తులుగా పెట్టుకొని సర్టిఫికెట్లను జారీ చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. సామాన్యులు మాత్రం సర్టిఫికెట్ల కోసం నెలల తరబడి పడిగాపులు కాసే పరిస్థితులు ఉన్నాయి. జిల్లా కేంద్రంలోనే తహశీల్దార్ కార్యాలయాలు అవినీతికి అడ్డాలుగా మారినప్పటికీ జిల్లా ఉన్నతాధికారులు మాత్రం అటువైపు చూడకపోవడం విమర్శలకు తావిస్తోంది.

నాలా అనుమతి.. గోవా టూర్..

నిజామాబాద్ నార్త్ తహసీల్దార్ కార్యాలయం అక్రమాలకు పరాకాష్టగా మారింది. నగరంలోని దుబ్బ ప్రాంతంలో ఐదుగురు ప్రభుత్వ ఉపాధ్యాయులు సుమారు 500 గజాల స్థలాన్ని కొనుగోలు చేసి అపార్ట్‌మెంట్‌లాగా నిర్మించుకోవాలని ప్రయత్నించగా ఆ స్థలం పక్కనే అసైన్డ్‌మెంట్ ల్యాండ్ ఉండటంతో (...మిగతా 8వ పేజీలో)



జిల్లాకు ఎనిమిది సబ్‌స్టేషన్ల మంజూరు

- నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించేందుకు నూతన సబ్‌స్టేషన్లు
- జిల్లావ్యాప్తంగా 8 సబ్‌స్టేషన్ల మంజూరు
- ఒక్కో సబ్ స్టేషన్‌కు 2.5 కోట్ల నిధుల మంజూరు
- స్థలాలు సేకరిస్తే పనులు మొదలు

సుభాష్‌నగర్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించేందుకు టీజీఎస్‌పీడీసీఎల్ యాజమాన్యం నూతన సబ్‌స్టేషన్‌ను మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీచేసింది. జిల్లాలో చాలాచోట్లలో వోల్టేజీ సమస్యతో ఇబ్బందులు పడుతున్న దృష్ట్యాలో వోల్టేజీ ఉన్న సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి నాణ్యమైన విద్యుత్ సరఫరాను అందించేందుకు నూతన సబ్‌స్టేషన్‌లను మంజూరు చేసింది. ఇప్పటికే జిల్లాలో 215కు పైగా సబ్‌స్టేషన్లు ఉండగా అదనంగా సబ్‌స్టేషన్లను మంజూరు చేస్తూ ఉత్తర్వులను జారీ చేశారు. 33/11 కేవీ కెపాసిటీతో నూతన సబ్‌స్టేషన్లను ఏర్పాటు చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. టిజిఎన్‌పిడిసిఎల్ నిజామాబాద్ సర్కిల్ పరిధిలో 8 సబ్‌స్టేషన్లను మంజూరు చేస్తూ టిజిఎన్‌పిడిసిఎల్ యాజమాన్యం నిర్ణయం తీసుకుంది. అత్యంత సమస్యాత్మక ప్రాంతాల్లో సబ్‌స్టేషన్‌లను ఏర్పాటు చేయనుంది.

నిజామాబాద్ సర్కిల్ పరిధిలో ఎనిమిది నూతన సబ్‌స్టేషన్‌లు

టీజీఎన్‌పీడీసీఎల్ నిజామాబాద్ సర్కిల్ పరిధిలో ఎనిమిది నూతన సబ్‌స్టేషన్‌లను మంజూరు చేస్తూ యాజమాన్యం ఉత్తర్వులు జారీ చేసింది. నిజామాబాద్ రూరల్ మండలంలోని న్యాల్‌కల్, ఇందల్వాయి మండలంలోని తిర్మన్‌పల్లి, సిరికొండ మండలంలోని తాటిపల్లి, వేల్పూర్ మండలంలోని వాడి, భీంగల్ మండలంలోని రహత్‌నగర్, దనంబండ తాండా, నిజామాబాద్ నగరంలోని పూలాంగ్ చౌరస్తా, బోధన్ మండలంలోని ఎత్తొండలో నూతన సబ్‌స్టేషన్‌లను మంజూరు చేసింది. ఒక్కొక్క సబ్ స్టేషన్‌కు 2.5 కోట్లు నిధులు విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. పూలాంగ్ చౌరస్తా వద్ద ఇండోర్ ఉపకేంద్రంను ఏర్పాటు చేయడానికి అధికారులు సన్నద్ధం చేస్తున్నారు.

స్థలాలు ఓకే అయితే పనులు మొదలు

జిల్లాలోని నూతనంగా మంజూరైన ఎనిమిది సబ్‌స్టేషన్ల కోసం టీజీఎన్‌పీడీసీఎల్ జిల్లా అధికారులు స్థలాల ఎంపిక కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. ఎనిమిది సబ్‌స్టేషన్ల కోసం ప్రభుత్వ స్థలాల కోసం వెతుకుతున్నారు. ఎలాంటి గొడవలు లేని స్థలాన్ని ఎంపిక చేసి పనులు మొదలు పెట్టాలని ఉన్నతాధికారులచే జిల్లా అధికారులకు ఆదేశాలు అందాయి. ఒక్కో సబ్‌స్టేషన్‌కు సుమారు 2కోట్లకు పైగా నిధులు అవసరం అవుతాయి. వీటిని నిర్మించేందుకు జిల్లా అధికారులు సిద్ధంగా ఉన్నారు. స్థలాలు దొరకగానే పనులను మొదలు పెట్టనున్నారు.

స్థలాలను సేకరిస్తున్నాం..

- రవీందర్, ఎస్ఈ, టీజీఎన్‌పీడీసీఎల్, నిజామాబాద్



నిజామాబాద్ సర్కిల్ పరిధిలో నూతనంగా ఎనిమిది సబ్‌స్టేషన్‌లు మంజూరయ్యాయి. నగరంతో పాటు వివిధ ప్రాంతాల్లో సబ్‌స్టేషన్‌లను ఏర్పాటు చేస్తున్నాం. ఇందుకు స్థలాల కోసం ప్రాంతాలను పరిశీలిస్తున్నాం. స్థలాలు పరిశీలన పూర్తి కాగానే పనులను వెంటనే ప్రారంభిస్తాం. నూతన సబ్‌స్టేషన్ల మంజూరుతో ఆయా మండలాల్లో నాణ్యమైన విద్యుత్ అందిస్తున్నాం.

రైతులు కూరగాయలు పండించాలి

• వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి

మోపాల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): రైతులు వ్యవసాయంతో పాటు కూరగా యలను కూడా పండించాలని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగా రెడ్డి అన్నారు. మోపాల్ మండల కేంద్రంలో ఓ రైతు తన పొలంలో కూరగాయలను పండిస్తున్న పంటను శనివారం సందర్శించి పరిశీలించారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి వచ్చే పంటలను పండించడం సంతోషకరమన్నారు. రైతును ఆదర్శంగా తీసుకొని మిగతా రైతులు కూడా తమ పొలాల్లో వివిధ రకాల కూరగా యలను పండించుకోవడం వల్ల అధిక లాభాలను పొందుతారని తెలిపారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు, రైతులు ఉన్నారు.

రైతులకు అండగా సీఎం..

రైతులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అండగా ఉన్నారని ఏఎంసీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి అన్నారు. శనివారం మోపాల్ మండలకేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యం లో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో పీసీసీ డెలిగేట్ చంద్రశేఖర్‌గౌడ్, పార్టీ అధ్యక్షుడు సాయరెడ్డి, సొసైటీ చైర్మన్లు మోహన్‌రెడ్డి, గంగారెడ్డి, వైస్‌చైర్మన్ రాజాకిషన్, మాజీ జెడ్పీటీసీ మోహన్, మాజీ ఎంపీటీసీలు, సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.

జిల్లా సమాఖ్య నూతన భవన నిర్మాణానికి నిధులు

నిజామాబాద్ అర్బన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం జిల్లా సమాఖ్య నూతన భవన నిర్మాణం కోసం నిధులు మంజూరు చేసినట్లు డీఆర్‌డీవో సాయాగౌడ్ తెలిపారు. శనివారం జిల్లా కలెక్టరేట్‌లోని డీఆర్‌డీఏ కార్యాలయంలో జిల్లా సమాఖ్య సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. మహిళా శక్తి కార్యక్రమాల్లో భాగం గా సంఘాల్లో లేని వారిని సంఘాల్లో చేర్పించాలని కోరారు. సంస్థాగత నిర్మాణం, బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి, పామ్, నాన్‌పామ్ మండల సమాఖ్య, గ్రామ సమస్యల ఆడిట్‌పై చర్చించారు. సెర్ప్ అధికారిణి భారతి, డీపీఎంలు సంధ్యారాణి, సాయిలు, శ్రీనివాస్, మారుతి, స్త్రీనిధి ఆర్‌ఎం రాందాస్ తదితరులు పాల్గొన్నారు.

బైపాస్ రోడ్‌లో దొంగతనం

మోపాల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బైపాస్ రోడ్‌లో ఉన్న మెడిలైఫ్ ఫార్మసీలో శుక్రవారం రాత్రి గుర్తుతెలియని దొంగలు తాళం పగలగొట్టి దొంగతనానికి పాల్పడ్డారని షాపు యజమాని అజయ్‌కుమార్ శనివారం ఫిర్యాదు చేసినట్లు ఎస్సై ఆరీఫ్ తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు సంఘటన స్థలాన్ని సందర్శించారు. 2లక్షల నగదు పోయినట్లు బాధితుడు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పీఆర్‌టీయూతోనే సమస్యల పరిష్కారం

• పీఆర్‌టీయూటీఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి వంగ మహేందర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అభ్యర్థి వంగ మహేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ మోహన్‌రెడ్డి

నిజామాబాద్ అర్బన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం పీఆర్‌టీయూతోనే సాధ్యమవుతుందని పీఆర్‌టీయూటీఎస్ కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి వంగ మహేందర్‌రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం ఆయన మాజీ ఎమ్మెల్సీ మోహన్‌రెడితో కలిసి జిల్లా పీఆర్‌టీయూ కార్యాలయంలో మాట్లాడారు. 1998 డీఎస్సీలో రాష్ట్రస్థాయిలో 43వ ర్యాంకు సాధించి మెదక్ జిల్లాలో 24ఏళ్లపాటు ఉపాధ్యాయుడిగా పనిచేశానని, సేవాదృక్పథంతో ఉపాధ్యాయులకు మరింత సేవ చేయాలనే స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేసి రాజకీయాల్లోకి వచ్చానని తెలిపారు. ఆదివారం నగరంలోని టీఎల్ఎన్ గార్డెన్‌లో ఇటీవల పదోన్నతి పొందిన ఉపాధ్యాయులకు సన్మాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా అధ్యక్షుడు మోహన్‌రెడ్డి తెలిపారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గంగోనె కిషన్, హైదరాబాద్ పీఆర్‌టీయూ టీఎస్ ప్రధాన కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, రచ్చ మురళి, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సత్యసాయి జయంతి వేడుకలు

• ఆకట్టుకున్న బాలవికాస్ చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు


పతాక ఆవిష్కరణలో పాల్గొన్న భక్తులు

ధర్పల్లి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): భగవాన్ శ్రీ సత్యసాయి బాబా జయంతి వేడుకలు శనివారం అత్యంత వైభవంగా జరిగాయి. ఉదయం ఓంకారం, జ్యోతిప్రజ్వలన, సుప్రభాతం, స్వామి పాదుకార్చన, ధ్వజారోహన, అనంతరం బాల వికాస్ పిల్లల సాంస్కృతిక కార్యక్రమాలు, ఆధ్యాత్మిక ఉపన్యాసాలు, హారతి, మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. జయంతి సందర్భంగా బాల వికాస్ చిన్నారులు చేసిన సాంస్కృతిక ప్రదర్శన గ్రామస్తులను ఆకట్టుకున్నాయి. ఉదయం పల్లకిసేవా కార్యక్రమంలో భక్తులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. గత 90 రోజులుగా ఉదయం 5గంటలకు సాయి భక్తులు చేసిన నగర సంకీర్తన కార్యక్రమం జయంతి సందర్భంగా ముగిసాయి. రాత్రి సత్యసాయి సేవా సదన్‌లో భజన కార్యక్రమాలు నిర్వహించి జయంతి ఉత్సవాలను నిర్వహించారు. కార్యక్రమంలో ధర్పల్లి సత్యసాయి సేవా సమితి భక్తులు పాల్గొన్నారు.

నిజామాబాద్‌లో..

నిజామాబాద్ కల్చరల్, నవంబరు23 (ఆంధ్రజ్యోతి): సత్యసాయిబాబా 98వ జయంతి ఉత్సవం శనివారం జిల్లా సత్య సాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఘనంగా సాగాయి. జయంతి ఉత్సవంలో భాగంగా ఉదయం ఓంకారం, నగర సంకీర్తన, బాలవికాస్ చిన్నారులచే కేక్ కటింగ్, లింగానికి రుద్రాభిషేకం, వేదపఠనం, భజనలు సాగాయి. సాయంత్రం సేవాసమితి ప్రాంగణంలో ప్రత్యేకంగా అలంకరించిన ఉయ్యాలలో సత్య సాయిబాబా ఫోటో ఉంచి డోలారోహణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో సత్యసాయి భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పోతలింగయ్య స్వామి ఉత్సవాలు

నిజామాబాద్ కల్చరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పెద్దబజార్‌లోగల పోతలింగయ్య స్వామి కార్తీకమాస ఉత్సవాలు శనివారం ఘనంగా సాగాయి. ఉత్సవాల్లో భాగంగా దేవతా మూర్తులకు వేదమంత్రాలతో పంచామృత అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో వేదపండితులు వేదమంత్రోచ్చరణలతో ప్రత్యేక పుష్పార్చన, విశేష పూజలు జరిపారు. అనంతరం మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన మహా అన్నప్రసాదంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

ఎమ్మెల్యేను కలిసిన గుట్టకింది తండావాసులు

ఇందల్వాయి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుట్టకింది గ్రామ పెద్దలు, వీడీసీ పెద్దలు, గ్రామస్తులు రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డిని హైదరాబాద్‌లోని తన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. గ్రామంలో పలు సమస్యలు ఉన్నాయని సమస్యల పరిష్కారానికి నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యేను కోరగా ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి తాండా అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారని సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను తీరుస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు నవీన్‌గౌడ్, గుట్టకింది తాండా మాజీ సర్పంచ్ మోహన్ నాయక్, మాజీ ఎంపీటీసీ పరుశురాం నాయక్, తిర్మన్‌పల్లి మాజీ ఎంపీటీసీ కిషన్, తాండా పెద్దలు శివరాం నాయక్, తండా నాయకులు పాల్గొన్నారు.

పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలి

నిజామాబాద్ అర్బన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కోరుతూ బహుజన లెఫ్ట్ ఫ్రంట్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి కలెక్టరేట్ ఏవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షురాలు సబ్బనిలత మాట్లాడుతూ నగరంలోని కంఠేశ్వర్ శివారులోగల సర్వే నంబరు 168 ప్రభుత్వ స్థలంలో గత ఏడాదికాలంగా పేదలు గుడిసెలు వేసుకొని అక్కడే నివసిస్తున్నారని ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ స్థలంలో ఉంటున్న వారికి పట్టాలు ఇచ్చి ఇందిరమ్మ ఇండ్లు నిర్మాణం చేస్తామని వాగ్దానం చేశారని కానీ ఇప్పటికీ ఒక్క ఇళ్లు కూడా మంజూరు చేయలేదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని ప్రకటించినందున సర్వే నంబరు 168లో పేదలకు ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో మౌనిక, జీజాబాయి, వాణి, ఉషా, పద్మిని, తదితరులు పాల్గొన్నారు.

నేడు నగరంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం

సుభాష్‌నగర్, నవంబరు23 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్రగతినగర్ ప్రాంతంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని నగర టౌన్-2 ఏడిఈ ప్రసాద్‌రెడ్డి తెలిపారు. 11కెవి లైన్‌లో మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు. ప్రగతినగర్‌తో పాటు కానుగంటి గార్డెన్‌లో ఉదయం 11గంటల నుంచి 1గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

కల్యాణం.. కమనీయం

• ముగిసిన శ్రీవారి బ్రహ్మోత్సవాలు



ధర్పల్లి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోవింద్‌పల్లి గ్రామంలో వెలసిన శ్రీవెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు శనివారంతో ముగిశాయి. మూడు రోజుల పాటు జరిగిన ఈ బ్రహ్మోత్సవాల్లో ఆలయంలో వివిధ భక్తికార్యక్రమాలు నిర్వహించారు. శనివారం శ్రీవారి కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు. కళ్యాణోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం పూర్ణాహుతి, డోలారోహనం, పల్లకిసేవ కార్యక్రమాలు నిర్వహించారు. బోలేవార్ మఠాధిపతి కిరణ్‌శాస్త్రి ఆధ్వర్యంలో బ్రహ్మోత్సవాలు కన్నుల పండుగగా జరిగాయి. మధ్యాహ్నం భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. మాజీ ఎంపీపీ నల్లసారిక హన్మంత్‌రెడ్డి, బ్రహ్మోత్సవాలకు హాజరై ప్రత్యేక పూజలు చేశారు.


గడుగును సన్మానిస్తున్న రాష్ట్ర ఆదర్శ రైతులు

గడుగును సన్మానించిన ఆదర్శ రైతులు

నిజామాబాద్ అర్బన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యవసాయ సంక్షేమ కమీషన్ మెంబర్‌గా నియమితులైన గడుగు గంగాధర్‌ను శనివారం నల్గొండ, వరంగల్, సూర్యాపేట నియోజకవర్గాలకు చెందిన ఆదర్శ రైతులు ఘనంగా సన్మానించారు. రాష్ట్ర ఆదర్శ రైతు రాష్ట్ర అధ్యక్షుడు, కార్యదర్శులు గడుగును సన్మానించగా గడుగు సైతం వారిని శాలువాలతో సన్మానించారు.

భారత సైకియాట్రిక్ జాతీయ సదస్సుకు డాక్టర్ విశాల్


డాక్టర్ విశాల్‌ను సన్మానిస్తున్న నిర్వాహకులు

సుభాష్‌నగర్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): భారత ప్రైవేటు సైకియాట్రిక్ అసోసియేషన్ 25వ జాతీయ సదస్సుకు జిల్లాకు చెందిన ప్రముఖ సైకియాట్రిక్ డాక్టర్ విశాల్ హాజరయ్యారు. ఈ సదస్సు నవంబర్ 21నుంచి 24వరకు మహారాష్ట్రలోని ఔరంగబాద్‌లో నిర్వహించారు. ఈ సదస్సుకు హాజరైన డాక్టర్ విశాల్ మెటబోలిక్ డిజాస్టర్ సైకియాట్రిక్ సమస్యలు వాటి నిర్వాహణ అనే అంశంపై ప్రత్యేకవక్తగా హాజరై మాట్లాడారు. మెటబోలిక్ డిజాస్టర్‌కు సంబంధించి డిప్రేషన్, ఆందోళన, ఒత్తిడితో కూడిన లక్షణాలపై విలువైన సలహాలను అందించారు. షుగర్, బీపీ, కొలస్ట్రాల్ వంటి మెటబోలిక్ డిజాస్టర్‌ఉన్న రోగులు భయం, గుండెదడలు, నిద్రలేమి, దుఃఖం, ఆత్మహత్య భావనలు అనుభవిస్తారని విశాల్ పేర్కొన్నారు. దీన్ని అధిగమించేందుకు బీపీ, షుగర్, కొలస్ట్రాల్ మందులతో పాటు ఆందోళన డిప్రేషన్ కూడా సమర్థవంతంగా చికిత్స చేయడం ముఖ్యమని సూచించారు. ఈసందర్భంగా నిర్వాహకులు డాక్టర్ విశాల్‌ను ఘనంగా సత్కరించారు.

'బోనస్ ఇచ్చి మాట నిలబెట్టుకున్న కాంగ్రెస్'

ఇందల్వాయి, నవంబరు23 (ఆంధ్రజ్యోతి): క్వింటాకు రూ.500 బోనస్ ఇచ్చి కాంగ్రెస్ పార్టీ మాట నిలబెట్టుకుందని కాంగ్రెస్ పార్టీ డీసీసీ డెలిగేట్ తలారి సుధాకర్ సంతోషం వ్యక్తం చేశారు. రైతులు, ప్రజల కోసం సీఎం రేవంత్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారని, మహిళలకు ఉచిత బస్సు ఉచిత కరెంట్, సబ్సిడీ గ్యాస్ వంటి పథకాలను అమలు చేయడం దేశానికే గర్వకారణమని అన్నారు. మద్దతు ధరకు ధాన్యాన్ని సేకరిస్తామని, సన్న వడ్లకు క్వింటాకు రూ.500 బోనస్ ప్రకటించిందని, ఇచ్చిన మాట ప్రకారం నేడు రైతుల ఖాతాల్లో జమచేయడం పట్ల రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోందని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డికి మండల రైతులు తరఫున కృతజ్ఞతలు తెలిపారు.

భక్తులతో కిటకిటలాడిన కాల భైరవ స్వామి ఆలయం

• కాలభైరవ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు • భక్తులకు ఘనంగా అన్నదానం • అంబరాన్నంటిన భైరవ స్వామి సంబురాలు


కాలభైరవ స్వామి, ఆలయానికి అధిక సంఖ్యలో హాజరైన భక్తులు

రామారెడ్డి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న కామారెడ్డి జిల్లా కేంద్రానికి 10 కిలో మీటర్ల దూరంలో ఉన్న ఇసన్నపల్లి- రామారెడ్డి మండలం మధ్యలో ఉన్న శ్రీ కాలభైరవ స్వామి ఆలయంలో శనివారం భక్తుల తాకిడితో ఆలయం దద్దరిల్లింది. ఆలయ పురోహితులు శ్రీనివాస్ శర్మ, పురోహితులు మంత్రోచ్చరణలతో సంతతు ధారాభిషేకం, డోలారోహణం, మహా పూజ, దక్షయజ్ఞం తదితర కార్యక్రమాలను నిర్వహించారు. సింధూర పూజ, పాలాభిషేకం తదితర వాటితో పాటు కాలభైరవ స్వామి బంగారు విగ్రహాన్ని కామారెడ్డి జిల్లా కేంద్రం చెందిన బ్యాంకు నుంచి రామారెడ్డి ఎస్ఐ నరేష్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు మధ్య ఆలయానికి తీసుకొచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పంతుళ్ళ మంత్రోచ్చారణలతో శ్రీ కాలభైరవ స్వామి బంగారు విగ్రహాన్ని తొట్టిలో వేసి భజా భజంత్రీలతో నామస్మరణ వైభవంగా నిర్వహించారు. అంతకు ముందు శ్రీ కాలభైరవ స్వామి ఆలయం చుట్టూ ఎడ్లబండ్లను ఊరేగింపు నిర్వహించారు. వైభవంగా పల్లకి సేవ నిర్వహించారు. కామారెడ్డి జిల్లాతో పాటు నిజామాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం, హైదరాబాద్, మెదక్, రాజన్న, సిరిసిల్ల, సంగారెడ్డి, సిద్దిపేట, జగిత్యాలతతో పాటు నిజామాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం, హైదరాబాద్, మెదక్, రాజన్న సిరిసిల్ల, సంగారెడ్డి, సిద్దిపేట, జగిత్యాల తదితర జిల్లాతో పాటు ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్నాటక, బెంగుళూరు తదితర రాష్ట్రాల భక్తులు హాజరయ్యారు. భక్తులకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఎస్ఐ నరేష్ ఆధ్వర్యంలోపోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు.భక్తులకు పెద్ద ఎత్తున అన్నదాన కార్ర్యమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో బుర్ల ప్రభురాం చంద్రం గుప్తా, గంజీ సతీష్ గుప్తా, మాలతి గుప్తా, అధికారులు, ప్రజాప్రతినిధులు, ఆలయ సిబ్బంది, అధిక సంఖ్యలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.

నేడు కమ్మ సంఘం ఆధ్వర్యంలో
కార్తీక మాస ఆత్మీయ సమ్మేళనం

బోధన్‌రూరల్,నవంబరు23(ఆంధ్రజ్యోతి): బోధన్‌లోని కమ్మ సంఘం ఆధ్వర్యంలో కార్తీక మాస ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం ఆదివారం నిర్వహించనున్నట్లు కమ్మ సంఘం అధ్యక్షులు పల్లెంపాటి శివన్నారాయణ, దావులూరి హరినాథ్ బాబు, పల్లెంపాటి శ్రీధర్ తెలిపారు. శనివారం బోధన్‌లోని కమ్మ సంఘంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. 8వ వార్షికోత్సవ కార్తీక వన భోజన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ మంత్రి మండవ వెంకటేశ్వర్ రావు, డాక్టర్ శ్రీమతి కోడె సుచరిత, ముమ్మాలనేని రాజశేఖర్, మండవ వెంకటేశ్వర్ రావు, ముమ్మాలనేని అమర్ నాథ్ బాబు, పూదోట రవి కిరణ్ తదితరులు ముఖ్య అతిథులు హజరుకానున్నారన్నారు. కార్యక్రమానికి కమ్మ సోదరులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఆదివారం ఉదయం 9గంటల నుండి 11గంటల వరకు ఆటపాట పోటీలతో పాటు కార్తీక వన భోజన కార్యక్రమాలు నిర్వహించబడతాయన్నారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ చైర్మన్‌పావులూరి వెంకటేశ్వర్ రావు, చెదలవాడ వెంకటేశ్వర్ రావు. ఏ.పాపారావు, తలసాని శ్రీకాంత్, పల్లెంపాటి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

రిపబ్లిక్ డే పరేడ్‌కు టీయూ విద్యార్థుల ఎంపిక

డిచ్‌పల్లి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): న్యూఢిల్లీలో జరగనున్న గణతంత్ర్య దినోత్సవ ఉత్సవాలకు టీయూ విద్యార్థులు తరుణ్, సింధూజ లను టీయూ వీసీ యాదగిరి రావు ప్రత్యేకంగా అభినందించారు. తెలంగాణకు కాంటిన్‌జెంట్ లీడర్‌గా వ్యహరించిన డా.సుమలత అసిస్టెంట్ ప్రొఫెసర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్‌గా ప్రభుత్వం డిగ్రీ కళాశాల ఆర్మూర్ ను తెలంగాణ యూనివర్సిటీ నుంచి ప్రీపరేడ్ కు క్యాంపు 2024 లో పాల్గొన్న వీరిని వర్సిటీ వీసీ యాదగిరి రావు రిజిస్ట్రార్ యాదగిరి అభినందించినట్లు వర్సిటీ ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ రవీందర్ రెడ్డి తెలిపారు. జల్గాన్ లో నిర్వహించిన ప్రీరిపబ్లిక్ డే పరేడ్ క్యాంపులో ఎంపికైన ఎన్ఎస్ ఎస్ వాలంటీర్లు 2025 జనవరి 26న ఢిల్లీలో జరిగే గణతంత్ర్య వే డుకల్లో పాల్గొంటారని ప్రోగ్రాం ఆఫీసర్ తెలిపారు.


కొత్త రేషన్ కార్డులు రాక తిప్పలు

• కొత్త రేషన్ కార్డుల కోసం ఎదిరిచూపులు • కొత్త రేషన్ కార్డుల ప్రక్రియ ప్రారంభించాలని వినతులు


డొంకేశ్వర్ తహసీల్దార్ కార్యాలయం

డొంకేశ్వర్, నవంబరు23(ఆంధ్రజ్యోతి): సంవత్సరా లుగా రేషన్‌కార్డులు మార్పులు చేర్పుల ప్రక్రియ జరగక పోవడంతో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారు. దుబాయి వెళ్ళినవారు కొత్తగా పెళ్ళయిన సంతా నం కలిగిన వారి వివరాలను నేటికి రేషన్‌కార్డులలో నమోదు చేసుకోక అవస్థలు పడుతున్నారు. డొంకేశ్వర్ మండల వ్యాప్తంగా 13 రేషన్ దుకాణాలు ఉండగా అం దులో 5592రేషన్ కార్డులు ఉన్నాయి. రేషన్ కార్డుల్లో పేరు నమోదు చేసుకోవడానికి అనేక సంఖ్యలో దరఖాస్తుల పెండింగ్‌లో ఉన్నాయి. రేషన్ కార్డు లేక ప్రభుత్వం సంక్షే మ పథకాలను పొందని వారికి సంఖ్య ప్రతీ ఏటా తగుతూ వస్తుంది. గతంలో ఉన్న కుటుంబ సభ్యుల పేర్లు మాత్రమే రేషన్‌కార్డులు ఉండడం అనం తరం సదరు కుటుంబంలోకి పెళ్లయి పిల్లకు జన్మనిచ్చి దుబాయిలో ఉండి ఇంటికి వచ్చిన వారి వివరాల నమోదుకు ప్రభుత్వం అవకాశం ఇవ్వకపోవడం ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఎవరైనా మరణిస్తే వారి పేర్లను తొలగించినంత త్వరగా కొత్త వారి పేర్లను నమోదు చేయకపోవడం విడ్డూరంగా ఉందని, గత ప్రభుత్వంపై నిరాశ చెంది ఉన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం నూతన రేషన్‌కార్డు న మోదు ప్రక్రియ త్వరలో ప్రారంభిస్తామని ప్రకటించడంతో ప్రజలు ఆనం దం వ్యక్తం చేస్తున్నారు. కుటుంబ సభ్యులు కొత్త పేర్లు నమోదు నూతన రేషన్‌కార్డు కోసం విడి విడిగా దరఖాస్తులు స్వీకరిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. దీంతో దరఖాస్తుల ప్రక్రియ తొందరగా ప్రారంభించాలని గ్రామీణ ప్రాంత వాసులు కోరుతున్నారు.

పదేళ్ల నుంచి ఎదురుచూపు



12ఏళ్ళ క్రితం దుబాయికి వెళ్ళాను. తిరిగి వచ్చి పదేళ్ళ అవుతుంది. రేషన్‌కార్డులో పేరులేదు, మా కుటుంబసభ్యులతో పాటు పేరు నమోదు చేయాలని రెవెన్యూ కార్యాలయం చుట్టు తిరిగి అలిసిపోయా. పదేళ్ళ నుంచి రేషన్ సరుకులు అందేదు. గ్రా మీణ ప్రాంతాల్లో రేషన్ నమోదు ప్రక్రియ వెంటనే ప్రారం భించాలి.

- సంజయ్, డొంకేశ్వర్

ఆర్మూర్ నుంచి అరుణాచల్‌కు బస్

పెర్కిట్, నవంబరు23(ఆంధ్రజ్యోతి), తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఆర్మూర్ నుంచి అరుణాచలంకు బస్సును శనివారం బయటు దేరింది. మెంటెనెన్స్ విభాగం ఇప్యూటీ ఆర్ఎం శంకర్ డిపోమేనేజర్ పి.రవికుమార్ ఎస్‌టీఐ పారు, ఎంఎఫ్ గంగాకిషన్, ఏడీసలు చక్రవర్తి, ఎస్‌వి.రెడ్డి, అశోక్, కాడిచర్ల నర్సయ్య, గంగాధర్‌లు పాల్గొన్నారు. ఆర్మూర్ పట్టణ చుట్టు పక్కల ప్రజలు ఆర్మూర్ నుంచి అరుణాచలంకు బయలుదేరే బస్సు సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాని తెలిపారు.

ఇంటిగ్రేటెడ్ స్కూల్ మంజూరుపై హర్షం


సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

ఆర్మూర్‌టౌన్, నవంబరు23(ఆంధ్రజ్యోతి), ఆర్మూర్ నియోజకవర్గానికి ఇంటి గ్రేటెడ్ స్కూల్ మంజూరుపై బీజేపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్య దర్శి జీవీ.నర్సింహరెడ్డి, అధికార ప్రతినిధులు కలిగోట గంగాధర్ జెస్సు అనిల్, ఆకుల శ్రీనివాస్, రోహిత్‌రెడ్డి, పొల్కం వేణు, పులి యుగంధర్, తదితరులు పాల్గొన్నారు.

వివాహిత మహిళ ఆత్మహత్య

బోధన్‌రూరల్,నవంబరు23(ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణంలోని ఆచన్ పల్లి సమీపంలో గల కాలనీలో షేక్.హసినా(31)అనే వివాహిత మహిళ శుక్రవారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నట్లు పట్టణ సీఐ వెంకట నారాయణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం శుక్రవారం రాత్రి ఇంట్లో చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిందన్నారు. మృతురాలి తల్లి హస్సేన్ బీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహన్ని బోధన్ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామన్నారు. ఆత్మహత్యకు గల కారణాలను అన్ని కోణాల్లో విచారణ చేపడుతున్నామని ఆయన పేర్కొన్నారు. మృతురాలికి భర్త షేక్.అబ్దుల్ రషీద్, ఇద్దరు పిల్లలు ఉన్నారని తెలిపారు.

చాకుతో దాడి చేసిన వ్యక్తి అరెస్టు

నవీపేట,నవంబరు23(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బర్కత్‌పుర కాలనీకి చెందిన షేక్.సోహెల్ అనే యువకుడిపై చాకుతో దాడి చేసిన అదే కాలనీకి చెందిన షేక్.గౌస్‌ను శనివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ వినయ్ తెలిపారు. 18న రాత్రి షేక్.సోహెల్ పొట్టలో చాకుతో పొడవడంతో అతనికి తీవ్ర గాయాలైన విషయం విదితమే. ఈ కేసుకు సంబంధించి నిందితుడు షేక్.గౌస్‌పై హత్యాయత్నం కేసు నమోదు చేసి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించడం జరిగిందని ఎస్ఐ తెలిపారు.

ఘనంగా భీమన్న గజాల ఊరేగింపు

కమ్మర్‌పల్లి, నవంబరు 23: ఆదివాసుల ఆరాధ్య దైవం భీమన్న దేవుడి ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని మండంలోని హసాకొత్తూర్ లో శనివారం గ్రామ ఆదివాసి నాయకపోడ్ సంఘం ఆధ్వర్యంలో భీమన్న గజాల ఊరేగింపు భక్తిశ్రద్దలతో ఘనంగా నిర్వహించారు. భక్తులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

ప్రత్యేక ఓటరు నమోదు చేసుకోవాలి

కోటగిరి,నవంబరు23(ఆంధ్రజ్యోతి): ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి సూచించారు. కోటగిరి, పొతంగల్, రుద్రూర్ మండల కేంద్రాల్లో శనివారం పోలింగ్ కేంద్రాలను బాన్సువాడ సబ్ కలెక్టర్ సందర్శించారు. పోలింగ్ కేంద్రాలలో ఓటు హక్కు నమోదు కోసం శని, ఆదివారాల్లో రెండు రోజుల పాటు ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. 18సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటరు నమోదుకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మార్పులు, చేర్పులు చేసుకునేందుకు వీలుంటుందని అన్నారు. పోలింగ్ కేంద్రాలలో అన్ని రకాల వసతులు కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కోటగిరి తహసీల్దార్ గంగాధర్, ఎంఈవో శ్రీనివాస్ రావు తదితరులున్నారు.

మోర్తాడ్‌లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం

మోర్తాడ్, నవంబరు23(ఆంధ్రజ్యోతి), మండల కేంద్రంలో బద్దం వాడ శివారులోని వ్యవసాయ తోటలో దొంగలు ట్రాన్స్‌పార్మర్‌ను ధ్వంసం చేసి అందులోని రాగి తీగలను దొంగిలించారని ఎస్సై విక్రం తెలిపారు. మోర్తాడ్ నుంచి కమ్మర్‌పల్లి వెళ్ళే రోడ్డు పక్కన అర్ధరాత్రి ట్రాన్స్‌పార్మర్ గద్దె నుంచి కిందికి పడగొట్టి ట్రాన్స్‌పార్మర్‌లోని ఆయిల్‌కాయిల్స్‌ను దొంగిలించారని, విద్యుత్ అధికారుల ఫిర్యాదు మేరకు సంఘటన స్థలాన్ని పరిశీలించామని తెలిపారు. రైతులు ట్రాన్స్‌పార్మర్‌ను జాగ్రత్తగా తీసుకోవాలని, రాత్రిల్లో అనుమానం ఉన్న వ్యక్తులు గుర్తించాలని, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

ట్రైబుల్ ఐటీఐలో సీట్లు సాధించాలి: డీఈవో

కమ్మర్‌పల్లి, నవంబరు 22: (ఆంధ్రజ్యోతి) పదవతరగతి విద్యార్థులు ఇప్పటి నుండే శ్రద్ధగా చదివి రానున్న వార్షిక పరీక్షల్లో 10 జిపిఏ సాధించి ట్రైబుల్ ఐటీఐలో సీట్లు సాదించాలని జిల్లా విద్యాధికారి అశోక్ అన్నారు. శుక్రవారం మండంలోని ఉప్లూర్ ఉన్నత, ప్రాథమిక పాఠశాలలను సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా పదవతరగతి విద్యార్థులకు పలుసబ్జెక్టులలో ప్రశ్ని ంచి జవాబులు రాబట్టారు. విద్యార్థుల ఫేర్‌నోట్సు, ఎన్ఏఎస్ ప్రశ్నపత్రాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతు 3,6,9 తరగతు లు విద్యార్థులను ఎన్ఏఎస్ పరీక్షలకు సిద్దంచేయాలని ఉపాధ్యాయులను ఆదేశించా రు. ఉపాధ్యాయులు టీచర్స్ డైరీ రాయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఈవో తోపాటు మం డల విద్యాధికారి ఎన్ ఆంధ్రయ్య, హెచ్ఎంలు కే రాజన్న, గిరిధర్, ఉపా ధ్యాయులు దేవన్న, సల్లూరి కిషన్ గౌడ్, మాసం శ్రీనివాస్ గౌడ్, గుండోజి రవిందర్, తదితర ఉపాధ్యాయుల పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి భూమిపూజ

ఆర్మూర్‌టౌన్, నవంబరు23(ఆంధ్రజ్యోతి), పట్టణంలోని దయానంద్ నగర్‌కాలనీలో మల్లికార్జున శివాలయం నిర్మాణానికి శనివారం పల్లిగుట్ట మంగిరాములు మహరాజ్ భూమిపూజ చేశారు. గత కొన్నేళ్ల క్రితం కాలనీలో శివలింగం, నంది వెలువడంతో భక్తులు షెడ్డు నిర్మించి ప్రతీరోజు పూజలు చేశారు. మందిర నిర్మాణాన్ని భక్తులు సంకల్పిం చుకొని మంగి రాములు మహరాజ్ చేతుల మీదుగా భూమిపూజ చేపట్టారు. ఈ కార్యక్ర మంలో కాలనీవాసులు కొడిగెల మల్లయ్య, పుప్పాల పోశెట్టి, సిద్దపురం రాజేశ్వర్, రాజేందర్, మహిళలు, తదిత రులు పాల్గొన్నారు.

పాఠశాలల తనిఖీ

కోటగిరి,నవంబరు23(ఆంధ్రజ్యోతి): పొతంగల్ మండలంలోని హెగ్డోలి, కారేగాం ప్రాథమిక పాఠశాలలను శనివారం ఎంఈవో లోల శంకర్ తనిఖీ చేశారు. పాఠశాలలో మధ్యాహ్న భోజన అమలు తీరును పరిశీలించారు. హెగ్డోలిలో 3వ తరగతి విద్యార్థులకు ఇంగ్లీష్ బోధన విధానాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

చలి కాలం.. జర భద్రం!

- అప్రమత్తంగా ఉండాలంటున్న వైద్యులు
- రోగ నిరోధక శక్తి తక్కువగా ఉన్న వారిపై వైరస్ దాడి
- పెరుగుతున్న న్యుమోనియా, అస్తమా కేసులు

టేక్ కేర్

తాడ్వాయి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): చల్లటి వాతావరణంలో జలుబు, దగ్గు, గొంతు నొప్పి, ఫ్లూ జ్వరం ఆయాసం, స్వైన్ ఫ్లూ కేసులు పెరు గుతున్నాయి. అస్తమా, సీవోపీడీ (క్రానిక్ అబ్‌స్ట్రక్టివ్ పల్మనరీ డీసీజ్) అలర్జీ, న్యుమోనియా తదితర శ్వాసకోశ వ్యాధుల ముప్పు పొంచి ఉంది. శ్వాసకోశ వ్యా దులతో రోగ నిరోధక శక్తి తక్కువగా ఉన్న వారిపై వైరస్ త్వరగా దాడి చేస్తుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. చెస్ట్, ఉస్మానియా, గాంధీ, ఫీవర్ ఆసుపత్రుల ఓపీ విభాగానికి వచ్చే రోగుల్లో సీజన్‌కు సంబంధించిన కేసులు పెరుగుతున్నాయి.

తేమ శాతం

వాతావరణ మార్పులతో చల్లటి గాలులకు శరీరం తెల్లగా పొడి బారినట్లు మారిపోతోంది. పెదవులు పగిలిపోయి ముఖం కాంతి హీనంగా మారుతుంది. అరికాళ్లు పగుళ్లు ఏర్పడుతున్నాయి. శరీరంలో తేమశాతం తగ్గడంతో చర్మ రక్షణ శక్తి తగ్గి దురదలు వస్తాయంటున్నారు. ముఖంపై పొడి భారిపోవడం వల్ల పగుళ్లు వస్తాయని వైద్యులు వివరించారు. చేతులపై పగుళ్ల మాదిరిగా తెల్లటి గీతలు వస్తాయంటున్నారు. ఈ తరహా సమస్యలు మధుమేహం రోగులకు వస్తే ఇబ్బందులుంటాయని, ఇన్‌ఫెక్షన్ పెరుగుతుందని పేర్కొంటున్నారు.

దగ్గు, ఆయాసం

వాతావరణం చల్లగా ఉండటంతో ప్రజలు సీవియర్ అలర్ట్ బ్రాంకైటీస్ బారినపడుతున్నారు. వాతావరణం మార్పుతో వైరస్ శక్తివంతం కావడంతో ప్రజలపై దాడి చేస్తోంది. దీంతో దగ్గు, ఆయాసం, గాలి పీల్చుకోవడం వంటి సమస్యలతో బాధపడే వారి సంఖ్య బాగా పెరిగింది. ఐదారు రోజుల్లో తగ్గే జబ్బు, అలర్జీలు ప్రస్తుతం వారం నుంచి రెండు వారాలు ఉంటున్నాయని వైద్యులు తెలిపారు. న్యుమోనియా, అస్తమా వంటి జబ్బులు కూడా పెరిగాయంటున్నారు.

అస్తమా ఉంటే అవస్థ

అస్తమా, న్యూమోనియా, సీవోపీడీ గుండె వ్యాధులతో బాధపడే వారికి చలి కాలం కష్టమేనని వైద్యులు అంటున్నారు. చల్లటి ప్రదేశంలో తిరిగినా, చల్లటి ఆహారం తీసుకున్నా, ఏసీ గదుల్లో ఉన్నా అస్తమా సమస్య పెరుగుతుంది. చలి కాలంలో దగ్గు, జలుబు వంటి సమస్యలు వస్తే అస్తమా, న్యుమోనియా రోగులకు మరింత అసౌకర్యంగా ఉంటుందని హెచ్చరిస్తున్నారు. అస్తమా, న్యుమోనియాతో బాధపడే వారు మందులు వాడక పోతే సమస్య తీవ్రంగా మారే అవకాశం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

నీరు వేడి చేసి తాగాలి

శ్వాసకోశ, చెవి, ముక్కు, గొంతు సమస్యలున్న వారు చలి కాలంలో జాగ్రత్తగా ఉండాలి. ఈనరు వేడి చేసి వడపోసు కుని తాగాలి. వెచ్చని దుస్తులు ధరించాలి, శరీరం పూర్తిగా కవర్ అయ్యే విధంగా జాగ్రత్తలు తీసుకోవాలి. చల్లటి పానీయాలు, ఐస్ క్రీమ్‌లు తీసుకోవద్దు. గొంతు నొప్పి ఉన్న వారు ప్రతిరోజు రెండుసార్లు వేడి చేసిన నీటిలో కొంచెం ఉప్పు వేసి వాటిని పుక్కిలించి ఉమ్మి వేయాలి. ఐదారుసార్లు చేయాలి, ఇలా ఉదయం సాయంత్రం చేస్తే గొంతు నొప్పి తగ్గే అవకాశ ముంది. ఫ్రిజ్‌లో పెట్టిన నీరు తాగొద్దు, వేడి ఆహారం తీసుకోవాలి.

గుండె జబ్బు బాధితులు జాగ్రత్తగా ఉండాలి

చలి కాలంలో గుండె జబ్బులు ఉన్న వారు జాగ్రత్తగా ఉండాలి. బ్లాక్స్, కొలెస్ట్రాల్ ఉన్న వారిలో రక్తనాళాల్లో పగుళ్లు ఏర్పడే అవకాశం ఉండటంతో గుండె వైఫల్యం చెందే ముప్పు ఉంటుంది. కొన్నిసార్లు ఇన్‌ఫెక్షన్ వల్ల కూడా రక్తనాళాలు రప్చర్ అవు తుంటాయి. చలి ఎక్కువగా ఉంటే వాకింగ్ చేయొద్దు. అధిక బరువు అస్తమా, గుండె జబ్బులున్న వారు వాకింగ్ విషయంలో అప్రమత్తంగా ఉండాలి. చలి కాలంలో స్మోకింగ్ చేయడం మానివేయాలి.



నిర్మాణంలో ఉన్న వంట గది | టాయిలెట్లు | ఐలాపూర్ ప్రభుత్వ పాఠశాలలో నిర్మించిన మరుగుదొడ్లు

సొంతూరుపై మమకారం.. అభివృద్ధికి సహకారం

- ఐలాపూర్ ప్రభుత్వ పాఠశాలను దత్తత తీసుకున్న పూర్ణచందర్ రెడ్డి
- మరుగుదొడ్లు, వంటశాలకు రూ.లక్షల్లో సొంత ఖర్చు
- గ్రంథాలయం ఏర్పాటుకు సన్నాహాలు

నందిపేట, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): పుట్టిన ఊరుకు ఏదో చేయాలని తపించాడు.. తాను స్థానికంగా చదవక పోయినా, కనీసం సొంతూరులో ఉన్న పాఠశాల అభివృద్ధికి పాటు పడాలని పూనుకున్నాడు... అంతే ఇక మదిలో మెదలగానే జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను దత్తత తీసుకుంటున్నట్లు ఆయన ప్రకటించాడు. అంతటితో ఆగకుండానే ఆ పాఠశాలకు కావాల్సిన వసతులను సమకూర్చుతున్నారు. ఇప్పటికే సొంతంగా రూ.లక్షలు వెచ్చించి మరుగు దొడ్లు, టాయిలెట్లు నిర్మాంచారు. వంటశాల నిర్మాణంలో ఉంది. గ్రంధాలయం ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారు. అంతే కాకుండా రాష్ట్ర ప్రభుత్వ పెద్దల అండ దండలు ఉండడంతో బీసీ మహిళా హాస్టల్, గ్రామంలో సీసీ రోడ్లుకు నిధులు, ఎస్సీ హాస్టల్ మరమ్మతులకు నిధులు తెచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఆయనే ప్రొద్దుటూరి పూర్ణచందర్ రెడ్డి అలియాస్ పురణ్ రెడ్డి. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి.

నందిపేట మండలం ఐలాపూర్ గ్రామానికి చెందిన ప్రొద్దుటూరి పూర్ణచందర్ రెడ్డి ఎన్నో వ్యాపారాలు చేస్తున్నారు. డబ్బులు బాగానే సంపాధిస్తున్నా మదిలో వెలితి కనిపిస్తోంది. ఇంత సంపాధిస్తున్నా మనం ఊరుకు ఏం చేయలేక పోతున్నామని ఆయనకు ఆయనే ప్రశ్నించుకున్నారు. చివరకు ఊరు కు గాని, ఊళ్లో స్కూల్‌కుగాని సహకారం చేయాలనుకున్నారు. తన పుట్టిన ఊరు అభివృద్ధికి పాటు పడాలని తపిస్తున్నారు. ముందుగా ఊరులో ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలను దత్తత తీసుకున్నారు. విద్యార్థులకు అవసరమైన మౌలిక సదు పాయాలను కల్పిస్తున్నారు. ఇప్పటికే రూ.లక్షలు వెచ్చించి విద్యార్థులకు సరిపడా టాయిలెట్లు, మరుగుదొడ్ల సముదాయం నిర్మించారు. వంటశాల నిర్మాణంలో ఉంది. గ్రామంలో యువత, నిరుద్యోగుల కోసం గ్రందాయం ఏర్పాటుకు గదులను అద్దెకు తీసుకు న్నారు. రాష్ట్ర ప్రభుత్వ పెద్దలతో బంధుత్వం, సాన్నిహిత్యం ఉండ దంతో బాలికల బీసీ హస్టల్‌ను తీసుకువచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. గ్రామంలో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం కోసం నిధుల మంజూరుకు కృషి చేస్తున్నారు. అంతే కాకుండా గ్రామంలో ఉన్న ఎస్సీ సాంఘిక సంక్షేమ గురుకుల హస్టల్ మరమ్మతులకు ప్రభుత్వ నిధులు తెచ్చేందుకు ప్రభుత్వ పెద్దలను ఇదివరకే కలిశారు.

ఊళ్లో పుట్టినందుకు సేవ చేస్తా..

- పి పూర్ణచందర్ రెడ్డి, ఐలాపూర్



ఐలాపూర్‌లో పుట్టినందుకు సేవా చేయాలని అనుకుంటున్నా. తాను స్థానికంగా చదువుకోలేక పోయినా గ్రామంలోని పిల్లలు చదువుకునేందుకు మౌలిక సదుపాయాలు కల్పిస్తా. ఈ పాటికే మరుగు దొడ్లు, టాయిలెట్లు నిర్మించాను. వంటశాల నిర్మాణంలో ఉంది. పాఠశాలకు ఇంకా ఏమైనా కావాలంటే తాను సంపాదిస్తున్న దాంట్లో నుంచి ఏమేరకైనా ఖర్చు చేస్తా. ప్రభుత్వ పెద్దలతో సంప్రదింపులు చేసి బీసీ బాలికల హాస్టల్‌ను మంజూరు చేయించడం లక్ష్యంగా పెటుకున్నా. అంతేకాకుండా గ్రామంలో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి నిధులు తెప్పిస్తా.

పాత నాణేలు, నోట్ల సేకరణ

- 35 ఏళ్లుగా సేకరిస్తున్న నవీపేట వ్యాపారి మహేష్ గుప్తా



మహేష్ సేకరించిన పాత కరెన్సీ నోట్లు



పాత నాణేలు

నవీపేట, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన యెర్ర మహేష్ గుప్తా అనే వ్యాపారి చిన్నప్పటి నుండి పాత నాణేలు, నోట్లను సేకరించడం అలవాటుగా చేసుకున్నాడు. 35 ఏళ్లుగా వీటిని సేకరిస్తూ తన వద్ద వాటిని జాగ్రత్తగా భద్రపర్చుకున్నాడు. దేశానికి స్వాతంత్ర్యం రాక మునుపు నుంచి చెలామణిలో ఉన్న ఏక అణ, అర్థ అణ, అణతో పాటు స్వాతంత్ర అనంతరం చెలామణిలోకి వచ్చిన ఒక పైసా, రెండు పైసలు, మూడు పైసలు, ఐదు పైసలు, పది పైసలు, 20పైసాలు, 25పైసాలు, 50పైసలు, ఒక్క రూపాయి, 2రూపాయలు, 5రూపాయల నాణేలు ఉన్నాయి. ఇందులో రాగి, వెండి, ఇత్తడి, అల్యూమినియంతో తయారైన అరుదైన నాణేలు ఉన్నాయి. వీటితో పాటు పలు దేశాలకు చెందిన నాణేలు కూడా సేకరించడం విశేషం. వీటితో పాటు ఒక్క రూపాయి, రెండు రూపాయలు, 5రూపాయలు, 10 రూపాయలు, 20 రూపాయలు, 50రూపాయలు, 100 రూపాయలతో పాటు ఇటీవల రద్దు అయిన 500రూపాయల నోట్లను సైతం సేకరించాడు. ఇందులో చాలా మట్టుకు పాత నాణేలతో పాటు నోట్లను నేటి తరానికి చెందిన పిల్లలు చూసి ఉండారు. ఇంతటి అరుదైన నాణేలు, నోట్లను యెర్ర మహేష్ సేకరించడం పట్ల స్థానికులు అభినందిస్తున్నారు. పాత నాణేలు, నోట్లను సేకరించడంలో నేటి యువతరానికి యెర్ర మహేష్ ఆదర్శంగా నిలుస్తున్నారు.



పాత నాణేలు, పాత నోట్లను చూపిస్తున్న యెర్ర మహేష్ గుప్తా

35ఏళ్లుగా పాత నాణేలు, నోట్లను సేకరిస్తున్నాను

యెర్ర మహేష్ గుప్తా, వ్యాపారి, నవీపేట



నేను గత 35 సంవత్సరాలుగా పాత నాణేలు, నోట్లను సేకరించడం అలవాటు చేసుకున్నాను. స్వాతంత్ర రాక ముందు అమలులో ఉన్న నాణేలతో పాటు స్వాతంత్రం వచ్చిన తర్వాత చెలామణిలోకి వచ్చి మధ్యలో కనిపించకుండా పోయిన నాణేలు సైతం నేను సేకరించాను. అలాగే పలు దేశాలకు చెందిన నాణేలను సైతం సేకరించడం జరిగింది. వీటితో పాటు పాత నోట్లను సైతం సేకరించాను. పాత నాణేలు, నోట్లను సేకరించడం నాకు ఎంతో ఆనందంగా ఉంది.

సమీకృత మార్కెట్‌కు గ్రహణం

భీమ్‌గల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి), భీమ్‌గల్ మున్సిపాలిటీ ఏర్పాటు తర్వాత ప్రజల సౌకర్యార్థం పట్టణ కేంద్రంలో ఇరుకు ఇరుకుగా కొనసాగుతున్న కూరగాయలు, మాంసం మార్కెట్‌ను ఒకే చోట ఏర్పాటు చేసి పట్టణ ప్రజలకు సౌకర్యవంతంగా చేయాలన్న ఉద్దేశంతో పాత తహసీల్దార్ కార్యాలయం వేతనాల సమీకృత మార్కెట్ నిర్మించేందుకు అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వ ప్రణాళిక చేపట్టి ఇందుకు మూడు కోట్ల నిధులను మంజూరు చేసింది. ఈ పనులకు అప్పటి మంత్రి ప్రస్తుత ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి 7 డిసెంబర్ 2021 నాడు శంకుస్థాపన చేశారు. అప్పటి నుంచి నత్తనడకన పనులు కొనసాగుతున్నాయి. ఇప్పటివరకు 50 శాతం కూడా పనులు పూర్తి కాక మూలన పడ్డాయి. ప్రస్తుతం నిధులు విడుదల కాకపోవడంతో పనులు నిలిచిపోయినట్లు అధికారులు తెలుపుతున్నారు. లక్షలు వెచ్చించి లక్షణంగా పనులు మరుస్తున్నారని ప్రజలు మండిపడుతున్నారు.

ఇరుకు మార్కెట్‌తో ఇబ్బందులు..

పట్టణ కేంద్రంలో కూరగాయల మార్కెట్ ప్రధాన రోడ్డుపై కొనసాగడంతో ప్రతినిత్యం ఆ దారిన నడిచే వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పైగా మార్కెట్‌కు వచ్చే వారు వాహనాలన్నీ రోడ్డుపైనే పార్కింగ్ చేయడంతో ఉదయం, సాయంత్రం వేళల్లో ట్రాఫిక్ అంతరాయం కలుగుతుంది. సమీకృత మార్కెట్ ఏర్పాటు కల కలగానే మిగిలి పోతుంది. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి సమీకృత మార్కెట్‌ను వెంటనే పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు. ముఖ్యంగా భీమ్‌గల్ పట్టణ కేంద్రంలో సోమవారం సంత రోజు కూరగాయల వ్యాపారులు, మరి ఇతర వ్యాపారస్తులు రోడ్డుపై దుకాణాలు పెట్టడంతో మరింత ఇబ్బంది తలెత్తుతుంది.

కూరగాయలు, మాంసం మార్కెట్‌లను ఒకే చోట ఏర్పాటు చేయాలి..

బట్టు అనిల్, భీమ్‌గల్



ప్రభుత్వం కూరగాయల మాంసం మార్కెట్‌ను ఒకే చోట ఏర్పాటు చేస్తే ప్రజలందరికీ సౌకర్యంగా ఉంటుంది. రోడ్డుపై మార్కెట్ కొనసాగడంతో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. కావున సమీకృత మార్కెట్ నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేసి మార్కెట్‌ను ఇక్కడికి తరలించాలి.

నిధులు విడుదల చేస్తే పనులు పూర్తి చేస్తాం..

రామకృష్ణ, మున్సిపల్ కమిషనర్, భీమ్‌గల్



గతంలో నిధులు విడుదలైన మట్టుకు పనులు జరిగాయి. ప్రస్తుతం నిధులు విడుదల కాకపోవడంతో పనులు కొంత మేర నిలిచిపోయాయి. ప్రభుత్వం నిధులు విడుదల చేసి న వెంటనే పనులు పూర్తి చేస్తాం,



మధ్యలోనే నిలిచిపోయిన సమీకృత మార్కెట్ నిర్మాణ భవనం



శిలాఫలకం



రోడ్డుపై కూరగాయల మార్కెట్‌తో జనం రద్దీ

పత్తి కొనుగోళ్లలో నిబంధనలకు నీళ్లు

జర దేఖో!!



పత్తి విక్రయానికి వచ్చిన వాహనాలు

- లైసెన్స్ లేకపోయినా దర్జాగా దందా
- ఇష్టారాజ్యంగా కమీషన్ వసూలు
- నష్టపోతున్న రైతులు

మద్నూర్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మద్నూర్ మండల కేంద్రంలోని పత్తి మార్కెట్‌లో ప్రైవేట్ కమీషన్ ఏజెంట్లు రైతుల నుంచి ఇష్టారాజ్యంగా కమీషన్ వసూలు చేస్తూ రైతులకు నష్టపరుస్తున్నారు. మార్కెట్ విధించిన నిబంధనలకు నీళ్లు వదులు తున్నారు. దీంతో ఆరు గాలం కష్టపడి పండించిన రైతన్న నష్టపోతున్నారు. కామారెడ్డి జిల్లాలోని మద్నూర్ మండల కేంద్రంలో పత్తి కొనుగోళ్లు ముమ్మరంగా సాగుతున్న నేపథ్యంలో కమీషన్ల దందా కూడా జోరుగానే సాగుతుంది. కొందరు లైసెన్స్‌లు లేకుండా పత్తి కొనుగోలు సాగిస్తుండగా మరికొందరు మార్కెటింగ్ శాఖ నిర్ణయించిన కమీషన్ కంటే అదనంగా వసూలు చేసి దందా సాగిస్తున్నారు. దీంతో వ్యాపారులకు, రైతులకు మధ్య గొడవ తలెత్తుతుంది. జిల్లాలోని మద్నూర్ మార్కెట్‌లో పత్తి వ్యాపారం ప్రతీ ఏడాది వేల కోట్ల రూపాయల వరకు జరుగుతుంది. గుంటూరు, కోయంబత్తూరు, గుజరాత్, మహారాష్ట్ర తదితర ప్రాంతాలకు ఇక్కడి నుంచి పత్తి ఎగుమతి అవుతుంది. ఇక్కడ ఉన్నటువంటి 11 జిన్నింగ్ మిల్లుల్లో జిన్నింగు అనంతరం వచ్చిన రూయిని ఎగుమతి చేస్తుంటారు. ఈ ప్రాంతంలో నల్లరేగడి భూములు అధికంగా ఉండటంతో పత్తి పంట అధికంగా పండటంతో పాటు నాణ్యతగా కలిగి ఉంటుంది. దీంతో ఇతర రాష్ట్రాలకు చెందిన వ్యాపారులు మద్నూర్ పత్తిని కొనుగోలు చేసేందుకు ఉత్సాహం చూపుతారు. ప్రతీ ఏడాది ప్రభు త్వం రైతులకు గిట్టుబాటు ధర కల్పించడానికి గాను సీసీఐ కొను గోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తారు. ఈ ఏడాది కూడా 8 సీసీఐ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. పత్తి వ్యాపారం ఇక్కడ ముమ్మరంగా సాగుతుంది. వాస్తవానికి కమిషన్ వ్యాపారి లైసెన్సు తీసుకున్న వారు రైతుల నుంచి పత్తిని కొనుగోలు చేసి క్వింటాల్‌కు రూ.1.56 చొప్పున కమిషన్ తీసుకోవాల్సి ఉంటుంది. మార్కెట్‌కు క్వింటాల్‌కు రూపాయి చొప్పున వ్యాపారులు చెల్లించాల్సి ఉంటుంది. ఇది మార్కెట్ శాఖ నిబంధన అయితే కమీషన్ వ్యాపారులు రైతుల నుంచి రూ.4కు పైగా వసూలు చేస్తున్నారు. కొంత మంది రైతులకు పెట్టుబడి పెట్టిన చోట కమీషన్ రూ.5 కూడా తీసుకుం టున్నారు. ఇదంతా అనధికారికంగా సాగుతున్న దందా మార్కె టింగ్ శాఖ వద్ద కొనుగోలుదారుల కింద ట్రేడింగ్ లైసెన్సులు మరి కొందరు కమీషన్ దారులు లైసెన్స్‌లు తీసుకొని పత్తి కొనుగోళ్లలో పాల్గొనాల్సి ఉంటుంది. ట్రేడింగ్ లైసెన్స్ కలిగిన వ్యాపారులు రైతుల వద్ద కమీషన్ తీసుకోకూడదు. కమీ షన్ వ్యాపారులు మాత్రమే రైతులకు కొనుగోలుదారులకు మధ్య కమీషన్ ఏజెంట్లకు మార్కెటింగ్ శాఖ నిబంధనల ప్రకారం కమీషన్ తీసుకోవాల్సి ఉంది. లైసెన్స్‌లు లేకపోయినా వేరే వారి లైసెన్స్ పేర్లతో కొందరు ఉండగా, కమీషన్ వ్యాపారి లైసెన్స్ లేకుం డా పత్తి కొనుగోలు చేయించి కమీషన్ వ్యాపారి లైసెన్స్ లేకుండా పత్తి కొనుగోలు చేయించి కమీషన్ కూడా అధికంగా గుంజుతున్న ఏజెంట్లు కూడా అధికంగానే ఉన్నారు. మద్నూర్ వ్యవసాయ మార్కెట్‌లో వందకుపైగా కమీషన్ ఏజెంట్లు ఉండగా ట్రేడింగ్ లైసెన్స్ కలిగిన వారు 8 మంది కమీషన్ ఏజెంట్‌లుగా లైసెన్స్ పొందిన వారు 19 మంది ఉన్నారు. ప్రైవేట్ వ్యాపారం చేస్తూ కమీషన్ ఏజెంట్లుగా రైతుల నుంచి పత్తి కొనుగోలు వారి వద్ద నుంచి అధికంగా కమీషన్ చేస్తున్నారు. మార్కెటింగ్ శాఖ అధికారులు కమీషన్ ఏజెంట్లు లైసెన్స్ లేకుండా రైతుల నుంచి కమీషన్ తీసుకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అయినప్పటికీ లైసెన్స్‌లు లేకుండానే రైతుల నుంచి పత్తి కొనుగోలు చేస్తున్నారు. దీంతో రైతులు నష్టపోతున్నారు. మార్కెటింగ్ శాఖకు ఆదాయం రావడం లేదు. ప్రభుత్వం నిబంధనల మేరకు క్వింటాల్‌కు రూపాయి చొప్పున మార్కెటింగ్ శాఖకు ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. లైసెన్స్‌లు లేకపోవడం వల్ల కొనుగోలు చేసిన దాని లావాదేవీలు తెలవకుండా ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు.

మృతుడి కుటుంబ సభ్యులకు పరామర్శ



అంక్సాపూర్‌లో పెద్దమల్లయ్య చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నాయకులు

వేల్పూర్, నవంబరు23(ఆంధ్రజ్యోతి):వేల్పూర్ మండలం అంక్సాపూర్ గ్రామానికి చెందిన రైతు పాశపు చిన్నోల్ల పెద్దమల్లయ్య మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న ఈఆర్ తెలంగాణ ఫౌండేషన్ ఛైర్మన్ చార్టెడ్ అకౌంటెంట్ ఈరవత్రి రాజశేఖర్ శనివారం ఆయన ఇంటికి వెళ్ళి మృతుని కుమారుడు పాశపు కిషన్ కుటుంబసభ్యులను పరామర్శించారు.పెద్దమల్లయ్య మృతికి గల కారణాలను కుటుంబసభ్యులను అడిగితెలుసుకొని ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఆయన వెంట న్యాయవాది సుదర్శన్, మాజీఎంపీటీసీ గంగా రెడ్డి, కొంటి రాంచందర్, అర్గుల్ సురేష్, తదితరులు ఉన్నారు.

చందూర్ నూతన ఏవోగా రాజశేఖర్

- ఏవోను సన్మానించిన పలువురు నాయకులు, రైతులు

మోస్రా,నవంబరు23(ఆంధ్రజ్యోతి): చందూర్ మండల కేంద్రానికి నూతనంగా వచ్చిన వ్యవసాయ శాఖ అధికారిగా బాధ్యతలు చేపట్టిన ఏవో రాజశేఖర్‌ను ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షులు ప్యారం అశోక్ యాదవ్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ మండల రైతులకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని రైతు అభివృద్ధికి పంటలపై అవగాహనపై కృషి చేస్తానని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు అచ్చన్న గారి సుదర్శన్ రెడ్డి, సహకార సంఘం కార్యదర్శి భూమయ్య, లక్మాపూర్, కారేగాం, మేడిపల్లి రైతులు పాల్గొన్నారు.

వరి కొయ్యలకు నిప్పంటించడంతో కాలిన చెట్లు



కమలాపూర్‌లో వరి కొయ్యలు కాల్చడంతో రోడ్డు పక్కన చెట్లు కాలిపోయిన దృశ్యం

మోర్తాడ్, నవంబరు23(ఆంధ్రజ్యోతి) వానకాలం వరికోతలు చివరి దశలో ఉన్నందున వచ్చే యాసంగికి సన్నత్తమవుతున్న రైతులు ఎట్టిపరిస్థితుల్లో కూడా వరి కొయ్యలను కాల్చావద్దని మండల వ్యవసాయాధికారి హరిష్ కు మార్ తెలిపారు. వరికొయ్యాలను కాల్చడం వల్ల పరివరణం చెడు ప్రభావం పడుతుందని,మట్టిలోని సుక్ష్మాజీవులు తగ్గిపోవడం, విలువైన పోషకాలు అవిరి అవ్వడం,మట్టికి తేమను పట్టుకునే ఉండే గుణం తగ్గిపోవడం వంటి నష్టాలు ఉన్నాయని అన్నారు. రైతులు ఏవోలను సంప్రదిం చాలని కోరారు.

నవీపేట: మండలంలోని కమలాపూర్ శివారులో శనివారం మధ్యాహ్నం వరి కొయ్యలకు నిప్పంటించడంతో రోడ్డు పక్కన ఉన్న పలు చెట్లు కాలిపోయాయి. నవీపేట నుండి కమలాపూర్ వెళ్లే రహదారిలో నాలుగు సంవత్సరాల క్రితం హరితహారంలో భాగంగా రోడ్లకు ఇరు వైపులా పెద్ద ఎత్తున చెట్లను నాటారు. ప్రస్తుతం చెట్లు పెద్దవిగా మారాయి. వరి కొయ్యలకు నిప్పంటించడంతో రోడ్డు పక్కనే ఉన్న సుమారు 20చెట్ల వరకు కాలిపోయాయి. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శి ప్రమీలాను వివరణ కోరగా వరి కొయ్యలకు నిప్పంటించిన వారికి నోటీసులు ఇవ్వనున్నట్లు ఆమె పేర్కొన్నారు.

వృథాగా డబుల్ ఇళ్లు!

(5వ పేజీ తరువాయి)

కమిటీల ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేసి ఇళ్ల నిర్మాణాన్ని పర్యవేక్షించనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకం తీసుకోవడంతో డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణంపై ఇంకా ఫోకస్ పెట్టలేదు. పూర్తయిన ఇళ్లను మాత్రం లబ్ధిదారులకు ఎంపిక చేసేందుకు సిద్ధామవుతుంది. జిల్లాలోని ఆయా నియోజకవర్గాల పరిధిలో పూర్తయిన ఇళ్ల నిర్మాణంతోపాటు వివిధస్థాయిలో ఉన్న ఇండ్ల నిర్మాణాల వివరాలను కూడా సేకరించారు. ప్రభుత్వానికి నివేదిక రూపంలో పంపించారు. ఇందిరమ్మ ఇళ్లకు మార్గదర్శకాలు విడుదలైన తర్వాతే డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణంపై ప్రభుత్వం చర్యలు తీసుకునే అవకాశం ఉందని అధికారుల సమాచారం బట్టి తెలుస్తోంది. ఇప్పటికే జిల్లాస్థాయిలో ఈ వివరాలను సేకరించిన అధికారులు నిర్మాణంలో ఉన్న ఇళ్లకు ఎంతమొత్తంలో డబ్బులు అవసరమవుతాయో ఆ నివేదికను కూడా పంపించినట్లు తెలుస్తోంది. ప్రభుత్వం తీసుకునే నిర్ణయం ఆధారంగా డబుల్ బెడ్‌రూం ఇళ్లను పేదలకు కేటాయించనున్నట్లు అధికారులు తెలిపారు. రాష్ట్రప్రభుత్వం గృహనిర్మాణ శాఖను మళ్లీ పునరుద్ధరించడంతోపాటు జిల్లాల వారిగా ఆ శాఖలకు ఉద్యోగులను కేటాయించేందుకు చర్యలు తీసుకున్నారు. జిల్లాస్థాయిలో కూడా ప్రస్తుతం ఒక ఈఈతో పాటు ఇద్దరు డీఈలు, ఇద్దరు ఏఈలతో పాటు కొంతమంది స్టాఫ్‌ను కూడా నియమించారు. ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక ప్రారంభమయ్యేలోపు మిగతా సిబ్బందిని కూడా నియమించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలుస్తోంది. కలెక్టరేట్‌లోనే ఈ శాఖ కార్యాలయాన్ని ఏర్పాటుచేశారు. గత ప్రభుత్వం హయాంలో శాఖను తొలగించగా ప్రస్తుతం పునరుద్ధరించడంతో పాటు ఈ శాఖ నుంచి ఇతర శాఖలకు వెళ్లిన ఉద్యోగులను కూడా తిరిగి మాతృశాఖకు వచ్చేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. మండలస్థాయిలో కూడా ఇళ్లను పర్యవేక్షించేందుకు ఏఈ స్థాయి అధికారులను నియ మించే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

అంతా గందరగోళం

(5వ పేజీ తరువాయి)

తహశీల్దార్ నాళా అనుమతులను నిరాకరించినట్లు తెలుస్తుంది. ఎలాగైనా నాళా పర్మిషన్ ఇవ్వాలని సదరు ఉపాధ్యాయులు తహశీల్దార్‌పై ఒత్తిడి తేగా కార్యాలయంలోని కొంత మంది సిబ్బందితో పాటు తహశీల్దార్ రెండు మూడు రోజులు గోవా టూర్‌కు వెళ్లినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ గోవా టూర్ ఖర్చు మొత్తం సదరు ఉపాధ్యాయులే భరించినట్లు తెలుస్తుంది. అర్సపల్లి శివారులోని గౌడ కాలనీ అనుకొని ఓ వెంచర్‌కు సంబంధించి నాళా అనుమతులు, దుబ్బ ప్రాంతంలో నాళా అనుమతుల విషయంలో భారీగానే ముడుపులు అందుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం : టీపీసీసీ డెలిగేట్



నందిపేటలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు



బినోలలో..



దేగాంలో..

బోధన్‌రూరల్,నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం అనేక విధాలుగా కృషి చేస్తుందని టీపీసీసీ డెలిగేట్ గంగాశంకర్ అన్నారు. శనివారం బోధన్ మండలంలోని కల్దుర్కి గ్రామంతో పాటు సాలూర మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు సీఎం రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహించారు. రైతులకు ఇచ్చిన మాట ప్రకారం సన్నరకం వరి ధాన్యానికి క్వింటాలుకు 500రూపాయల చొప్పున బోనస్ జమ కావడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు నాగేశ్వర్ రావు, మందర్నా రవి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చీల శంకర్, సహకార సంఘం అధ్యక్షులు శరత్, గణపతి రెడ్డి, మాజీ సర్పంచ్ లాలు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు నరేందర్ రెడ్డి, సాలూర గ్రామ అధ్యక్షులు అల్లె జనార్దన్, సీనియర్ నాయకులు అల్లె రమేష్, ఖాజాపూర్ అశోక్, కేజీ గంగారాం, శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నందిపేట: మండల కేంద్రంలోని పాత బస్టాండ్ ప్రాంతం లో శనివారం సీఎం ఎనుముల రేవంత్‌రెడ్డి చిత్ర పటానికి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మంద మహిపాల్, నిజామాబాద్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పెంట ఇంద్రుడు క్షీరాభిషేకం చేశారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ ప్రకారం సన్నరకం వడ్లకు క్వింటాలుకు రూ.500 చొప్పున బోనస్ డబ్బులను రాష్ట్ర ప్రభుత్వం రైతుల ఖాతాల్లో జమ చేసింది. దీనికి హర్షం వ్యక్తం చేస్తూ సీఎం రేవంత్ రెడ్డితో పాటు పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, రాష్ట్రమంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, బోధన్ ఎమ్మెల్యే ప్రొద్దుటూరి సు దర్శన్ రెడ్డి, ఆర్మూర్ నియోజక వర్గం ఇన్‌చార్జీ వినయ్‌రెడ్డి చిత్ర పటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈకార్యక్ర మంలో నాయకులు సాయరెడ్డి, భూమేష్, వెంకటేష్, యూసుఫ్, రాజేందర్, శ్రీను తదితరులు ఉన్నారు.

మోపాల్: రైతులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అండగా ఉన్నారని ఏఎంసీ చైర్మన్ ముప్పగంగారెడ్డి అన్నారు. శనివారం మోపాల్ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో రైతులకు ఇచ్చిన హామీ మేరకు ఒక్కోక్కటి అమలు పరుస్తున్నారని అన్నారు. రైతులకు రూ.500 బోనస్ ఇస్తానని చెప్పి సీఎం మాట నిలబెట్టుకున్నారని అన్నారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా సీఎం పాటుపడుతున్నారని అన్నారు. రైతులకు బోనస్ ఇప్పటికే అనేక మందికి పడుతున్నాయని తెలిపారు.గతంలో పాలించిన పాలకులు రైతుల పట్ల నిర్లక్ష్యం వహించారని అన్నారు. సీఎం రైతులకు అండగా ఉన్నారని తెలిపారు.ఈకార్యక్రమంలో పీసీసీడెలిగేట్ చంద్రశేఖర్‌గౌడ్, పార్టీ అధ్యక్షుడు సాయరెడ్డి, సొసైటీ చైర్మన్‌లు మోహన్‌రెడ్డి, గంగారెడ్డి, వైస్‌చైర్మన్ రాజాకిషన్,మాజీజడ్పీటీసీ,ఎంపీటీసీలు,సర్పంచులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

- సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతు లకు ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారని మాధవనగర్ సొసైటీ అధ్యక్షుడు నాగేశ్వర్‌రావు అన్నారు. శనివారం మాధవ నగర్ సొసైటీ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ నాగేశ్వర్ రావు మాట్లాడుతూ ఇప్పటి వరకు రైతులకు రూ.500 బోనస్ ఇచ్చిన వారు లేరని రైతులకు అండగా సీఎం రేవంత్‌రెడ్డి నిలుస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ఉపా ధ్యక్షులు పోతరెడ్డి, డైరెక్టర్లు సాంబశివరావు, రవీందర్, జనార్దన్, ముత్యాల సంతోష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు తరుణ్, శ్రీనివాస్‌రావు, వేణుగౌడ్, రమణ, మల్లేష్, శ్రీనివాస్, చింతపల్లి కృష్ణ, జనార్దన్‌రావు, స్వామి, ప్రభాకర్, సంతోష్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

నవీపేట: మండలంలోని బినోలలో శనివారం సీఎం రేవంత్ రెడ్డి, రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డిల చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు వరిపంటకు క్వింటాలుకు 500రూపాయల చొప్పున బోనస్ చెల్లించడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మహేందర్, పుట్టి పోశెట్టి, విజయ్, గంగాధర్, పలువురు రైతులు పాల్గొన్నారు.

ఆర్మూర్‌రూరల్: ఆలూర్ మండలం దేగాం గ్రామంలో శనివారం సీఎం రేవంత్‌రెడ్డి ఆర్మూర్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జీ వినయ్‌రెడ్డి చిత్రపటాలకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పాలాభిషేకం చేశారు. వడ్లకు రూ.500 బోనస్ ఇవ్వడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ సీఎం రేవంత్‌రెడ్డి, వినయ్‌రెడ్డిల చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీఎంపీటీసీ శ్రీనివాస్‌గౌడ్, మాజీడీసీఎంఎస్ వైస్‌చైర్మన్ లోక ముత్యంరెడ్డి, మాజీసర్పంచ్ మోతిరాం, గంగాధర్, చిన్నారెడ్డి, ప్రభాకర్, సాయి, మల్లేష్, సుదీర్, ప్రభు, సోమ గంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఇంటిగ్రేటెడ్ పరీక్షల టైం టేబుల్ విడుదల

డిచ్‌పల్లి,నవంబరు 23(ఆంధ్రజ్యోతి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని 2024 సంవత్సరపు టైం టేబుల్ విడుదల చేయడం జరిగిం దని సీవోఈ అరుణ తెలిపారు. పీజీ 5ఏళ్ల ఇంటిగ్రేటెడ్ కోర్సు ఏపీఈ, ఐపీసీహెచ్, 5,7,9 సెమిస్టర్ రెగ్యులర్ ఎక్సామ్, ఐఎంబీఏ, ఎల్ఎల్‌బీ, 5వ సెమిస్టర్ రెగ్యులర్ ఎక్సామ్ డిసెంబరు 5 నుంచి 16 వరకు జరు గుతాయని సీవోఈ అరుణ తెలిపారు. పూర్తి వివరాలకు వర్సిటీ వెబ్ సైట్ సంప్రదించలన్నారు.

- పీజీ 5ఏళ్ల ఇంటిగ్రెటెడ్ పరీక్ష పీజు తేది ప్రకటన

తెలంగాణ వర్సిటీ పరిధిలోని 5ఏళ్ల ఇంటిగ్రెటెడ్ కోర్సు పరీక్షల పీజు తేదిలను సీవోఈ అరుణ శనివారం ప్రకటించారు. ఏపీఈ,ఐపీసీహెచ్ 5,7,9 సెమిస్టర్ రెగ్యులర్, ఎల్ఎల్‌బీ, ఐఎంబీఏ, ఈ నెల 28న వరకు పీజు చెల్లించుకోవచ్చునని రూ.100 అపరాధ రుసుముతో డిసెంబరు 2 వరకు చెల్లించుకోడానికి ఆవకాశం ఉందని, ఇంటిగ్రెటెడ్ కోర్సుల పీజులు అన్ని సబ్జెక్టులకు రూ.500, ఐఎంబీఏ, 5వ సెమిస్టర్, అన్ని సబ్జెక్టులకు రూ.800 ఎల్ఎల్‌బీ 5వ సెమిస్టర్ ఐపీసీహెచ్ అన్ని సబ్జెక్టులకు రూ.600 చెల్లించాలని సీవోఈ తెలిపారు. పూర్తి వివరాలకు తెలంగాణ యూనివర్సిటీ వెబ్‌సైట్ సంప్రదించలన్నారు.

మూడేళ్లకు రైల్వేబ్రిడ్జి పునర్నిర్మాణ పనులు



మోర్తాడ్ రైల్వే బ్రిడ్జి పనులను పరిశీలిస్తున్న బీజేపీ రాష్ట్ర నాయకులు

మోర్తాడ్, నవంబరు23(ఆంధ్రజ్యోతి):మండల కేంద్రంలోని రైల్వే స్టేషన్‌కు వెళ్లే మొండివాగు బ్రిడ్జి నిర్మాణ పనులను శనివారం బీజేపీ రాష్ట్రకార్గవర్గ సభ్యులు పెద్దోళ్ల గంగారెడ్డి పరిశీలించారు. బ్రిడ్జి మూ డేళ్ల క్రితం భారీ వర్షాలకు కొట్టుకుపోయింది. కాగా బ్రిడ్జి నిర్మాణ పనులను రైల్వేశాఖ, ఆర్అండ్‌బీ శాఖ అధికారులు పట్టించుకోలేదని రైల్వే అధికారులతో చర్చించిన అనంతరం రైల్వే అధికారులు కేంద్ర నిధులతో బ్రిడ్జి నిర్మాణ పనులు చేపట్టాలని గంగారెడ్డి అన్నారు. ప్రయాణికులకు, వ్యవసాయదారులకు బ్రిడ్జి లేకపోవడంతో ఎంతో ఆందోళన పడ్డారని అన్నారు. బ్రిడ్జి నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌తో అన్నారు. ఆయన వెంట జిల్లా బీజేపీ ఓబీసీ నాయకులు దేవేందర్, బీజేపీ నాయకులు తీగెల రమేష్‌రెడ్డి, రాముగౌడ్; గడ్డం శ్రీనివాస్, గంగారాం, బద్దం రాజేశ్వర్, ఏలేటి సాయన్న, సంతోష్, తదితరులు ఉన్నారు.

టీయూ కాన్వకేషన్ దరఖాస్తుల గడువు పొడిగించాలి

డిచ్‌పల్లి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ యూనివర్సిటీ రెండో స్నాతకోత్సవం నిర్వహించడానికి పొడిగించాలని కోరుతూ శనివారం ఆడిట్ సెల్ డైరెక్టర్ ఘంట చంద్రశేఖర్, సౌత్ క్యాంపస్ ప్రిన్సిపాల్ సుధాకర్ గౌడ్ లకు విద్యార్థులు వినతి పత్రం అందజేశారు. గతంలో డాక్టరేట్ పూర్తి చేసుకొని కాన్వకేసన్ తీసుకున్న వారికి స్నాతకోత్సవంలో ఆవకాశం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రతినిధులు సత్యం, రమేశ్ పాల్గొన్నారు.

మహా ఎన్నికల ఫలితాలు తెలంగాణలో
పునరావృతం అవుతాయి : సుధాకర్ చారి



బోధన్‌లో స్వీట్లు తింటున్న బీజేపీ నాయకులు

బోధన్‌రూరల్,నవంబరు23(ఆంధ్రజ్యోతి):మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలలో బీజేపీ ఘన విజయం సాధించడంతో శనివారం సాయంత్రం బోధన్ బీజేపీ నాయకులు టపాకాయలు పేల్చి స్వీట్లు పంచిపెట్టారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా నాయకులు సుధాకర్‌చారి, పట్టణ అధ్యక్షుడు బాలరాజు మాట్లాడుతూ మహారాష్ట్రలో వచ్చిన ఎన్నికల ఫలితాలు తెలంగాణలో మళ్లీ వచ్చే ఎన్నికలలో పునరావృతం అవుతాయన్నారు. మహరాష్ట్రలో అత్యధిక మెజారిటీతో అత్యధిక స్థానాల్లో బీజేపీ పార్టీ గెలిచిందని మహరాష్ట్ర వాసులందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణలో వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలలో, మున్సిపల్ ఎన్నికలలో బీజేపీ ఘన విజయం సాధిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు వినోద్, కందికట్ల వాసు, పవన్ కుమార్, సింధి విజయ్, బీజేపీ మహిళ మోర్చా బోధన్ పట్టణ అధ్యక్షురాలు శ్రీదేవి రావు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నవీపేట: ఇటీవల మహారాష్ట్రలో జరిగిన ఎన్నికలకు సంబంధించి శనివారం వెలువడిన ఫలితాలలో భారతీయ జనతా పార్టీ కూటమి ఘన విజయం సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ బీజేపీ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. ఈ మేరకు మండల కేంద్రంలో శనివారం రాత్రి పెద్ద ఎత్తున బాణసంచా కాలుస్తూ స్వీట్లు పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్మూర్‌టౌన్:పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యా లయంలో శనివారం బీజేపీ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ కూటమి భారీ విజయం సాధించడంతో హర్షం వ్యక్తం చేస్తూ బీజేపీ నాయకులు స్వీట్లు పంచుకొని సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధానకార్యదర్శి జీవీ.నర్సింహరెడ్డి, అధికార ప్రతిని ధులు జెస్సు అనిల్, పాలెపు రాజు, ఆకుల శ్రీనివాస్, పొల్కంవేణు, పులి యు గంధర్, రోహిత్‌రెడ్డి, కలిగోట ప్రశాంత్, యాదగిరి, చిన్నారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చెక్‌పోస్టు దహనం చేసిన నిందితుడి అరెస్టు



నిందితునితో పోలీసులు

కోటగిరి,నవంబరు23(ఆంధ్రజ్యోతి): పోతంగల్ మండలంలోని కొడిచర్ల శివారులో ఏర్పాటు చేసిన రెవెన్యూ చెక్‌పోస్టును దగ్ధం చేసిన కేసులో నిందితుడిని అరెస్టు చేసినట్లు రుద్రూర్ సీఐ కృష్ణ వెల్లడించారు. రుద్రూరు సర్కిల్ కార్యాలయంలో శనివారం రాత్రి విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. డొంగ్లీ మండలం సిర్పూర్ గ్రామానికి చెందిన షేక్.అహ్మద్ అనే వ్యక్తిని పట్టుకుని విచారించగా నేరం ఒప్పుకున్నట్లు సీఐ తెలిపారు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ తెలిపారు. ఆయన వెంట కోటగిరి ఎస్ఐ అన్నారు.

తల్లిదండ్రులు, గురువులను గౌరవించాలి

- సైకాలాజిస్టు సుధీర్ సంద్ర

బోధన్‌రూరల్,నవంబరు23(ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు, గురువులను గౌరవించే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ లభిస్తుందని ప్రముఖ సైకాలాజిస్టు సుధీర్ సంద్ర అన్నారు. శనివారం బోదన్ పట్టణంలోని ఇందూర్ మోడల్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మోటివేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్పీకర్ సుధీర్ సంద్ర మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యం కోసం కష్టపడి ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. సమాజంలో జరుగుతున్న చెడు అలవాట్లకు ఎలా దూరం చేయాలో ప్రొజెక్టర్ ద్వారా ప్రదర్శించారు. విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలన్నారు. విద్యార్థులు తమ జీవితంలో వచ్చే కష్టాలకు భయపడవద్దని ఎన్ని కష్టాలు వచ్చినా ఎదుర్కొని పోరాడి గెలవాలని సూచించారు. విద్య కంటికి కనిపించని ఆభరణం అని విద్య యొక్క ప్రాముఖ్యతను వివరించారు. తల్లిదండ్రులు తమ పిల్లల ఉజ్వల భవిష్యత్ కోసం అనేక కష్టాలను ఓర్చుకుని ఒడిదుడులకు లోనై విద్యార్థుల భవిష్యత్‌కోసం కృషి చేస్తారని అలాగే విద్యార్థులు కూడా మంచిగా చదివి ఉన్నత స్థానాలకు చేరుకుని తమ తల్లిదండ్రుల రుణం తీర్చుకోవాలన్నారు. విద్యతోనే మనిషి జీవితంలో సమగ్ర అభివృద్ధి జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఇందూర్ పాఠశాల యాజమాన్యం, ట్రస్మా జిల్లా అధ్యక్షులు కొడాలి కిషోర్ కుమార్, ప్రిన్సిపాల్ రామారావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ముప్కాల్‌లో బీమన్న ఉత్సవాలు

ముప్కాల్,, నవంబరు23(ఆంధ్రజ్యోతి), కార్తీకమాసం పర్వదినం పురస్కరించుకొని ప్రతీ సంవత్సరం నిర్వహించే బీమన్న ఉత్సవాలను ఆదివారం ప్రారంభం కానున్నట్లు ముప్కాల్ ఆదివాసి నాయకపోడు సంఘం సభ్యులు తెలిపారు. ఆదివారం బీమన్నస్వామి దాతలు గుట్ట నుంచి ఉత్స వంగా గ్రామంలోని ప్రవేశించి సోమవారం గాదెలను ఊరేగింపుగా గోదా వరికి తీసుకువెళ్ళి గంగజలాలతో స్నానం నిర్వహించానున్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని బీమన్నదేవుని ఆశీస్సులు పొందాలని వారు కోరారు.

చిత్రలేఖనంలో సిరికొండ విద్యార్థిని

సిరికొండ,నవంబరు 23(ఆంధ్రజ్యోతి) ఈనెల 25న హైదరాబాద్‌లో జరిగే రాష్ట్ర స్థాయి చిత్రలేఖనం పోటీలకు సిరి కొండ విద్యార్థిని ఫరీన్‌ఎంపిక యినట్లు హెచ్ ఎం రావుట్ల నర్సయ్య తెలిపారు. భారత ఇందన వనరుల మంత్రిత్వ శా ఖ మరియు ఇందన సంరక్షణ కమిటీ సంయుక్తంగా నిర్వహిస్తున్న చిత్రలేఖనం పోటీలను ఈ నెల 25న హైదరా బాద్‌లో నిర్వహిస్తున్నారు. పాఠశాల స్థా యిలో శక్తి వనరుల, పొదుపుఆవశ్యకత అనే అంశంపై నిర్వ హించిన చిత్రలేఖనం పోటీలలో ప్రతిభ కనబరిచిన ఓ పా ఠశాల విద్యార్థిని ఫరీన్(9వ తరగతి) రాష్ట్ర స్థాయి గ్రూప్ బీ.విభాగానికి ఎంపి కయినట్లు నర్సయ్య తెలిపారు. కార్యక్ర మంలో ఉపాధ్యాయులు గంగారెడ్డి, రవి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ, పట్టభద్రుల డ్రాఫ్ట్ ఓటరు జాబితా విడుదల

- పట్టభద్రుల ఓటర్లు 27110 ● టీచర్ ఓటర్లు 3078 ● వచ్చేనెల 9 వరకు నమోదుకు మరో అవకాశం

నిజామాబాద్ అర్బన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ, పట్టభద్రుల డ్రాఫ్ట్ ఓటరు జాబితాను జిల్లా యంత్రాంగం శనివారం విడుదల చేసింది. ఉపాధ్యాయ ఓటర్లకు సంబంధించి మొత్తం జిల్లాలో 3199 మంది ఉపాధ్యాయులు తమ ఓటును నమోదు చేసుకున్నారు. ఇందులో పురుష ఉపాధ్యాయులు 1947, మహిళా ఉపాధ్యా యులు 1252 మంది ఉన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి సంబంధించి వచ్చే ఏడాది మార్చి 29న గడువు ముగియనుంది. తిరిగి ఎన్నికలు నిర్వహించనున్నారు. సెప్టెంబర్ 30 నుంచి ఈనెల 6వ తేదీ వరకు ఓటు నమోదుకు అవకాశం కల్పించారు. జిల్లాలో 2019 ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలప్పుడు 3078 మంది ఉపాధ్యాయులు ఓటును నమోదు చేసుకోగా ఇప్పుడు ఆ సంఖ్య కొంత పెరిగింది. పట్టభద్రుల ఓటరు డ్రాఫ్టుకు సంబంధించి జిల్లాలో 27110 మంది ఓటర్లు ఓటును నమోదు చేసుకున్నారు. ఇందులో పురుష ఓటర్లు 17237 మంది కాగా, మహిళా ఓటర్లు 9873 మంది ఉన్నారు. గత 2019లో జిల్లాలో 24,713 మంది పట్టభద్రుల ఓటర్లు ఉండగా ఈసారి సుమారు 2400 మందికిపైగా అదనంగా పట్టభద్రులు ఓటును నమోదు చేసుకున్నారు. పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి సంబంధించి ఓటు నమోదు దరఖాస్తు గడువును డిసెంబర్ 9 వరకు పొడగించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేయాలంటే ఖచ్చితంగా ఉపాధ్యాయులు, పట్టభద్రులు తమ పేరును నమోదు చేసుకోవాలి. 2021 అక్టోబర్ 31 నాటికి డిగ్రీ పూర్త యిన వారు పట్టభద్రులుగా ఓటు వేసేందుకు అర్హులు. గడువు డిసెంబర్ 9 వరకు ఉండటంతో ఓటరు జాబితా మరింత పెరిగే అవకాశం ఉంది.

డాటా ఎంట్రీ తప్పులు లేకుండా చేయాలి

ఆర్మూర్‌రూరల్, నవంబరు23(ఆంధ్రజ్యోతి), కంప్యూటర్ ఆపరేటర్‌లు ఏలాంటి తప్పు లు లేకుండా డాటా ఎంట్రీ చేపట్టాలని, వివరాలను ఆన్‌లైన్ నమోదు చేసే ప్రక్రి యలో ఎన్యుమారేటర్లు, సూపర్‌వైజర్‌లు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆలూర్ తహసీ ల్దార్ రమేష్ అన్నారు. శనివారం ఆలూర్ మండల కేంద్రంలో సమగ్ర ఇంటి సర్వే ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను ఆయన పరిశీలించారు. ఆన్‌లైన్ చేసే సమయంలో సమస్యలు ఎదురైతే అధికారుల దృష్టికి తీసుకువెళ్ళాలన్నారు. అనంతరం కంప్యూటర్ ఆపరేటర్‌లకు సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో నరేందర్, పంచాయతీ కార్యదర్శులు రాజలింగం, నాజర్, శ్రీనివాస్, నవీన్, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు





రకం	: లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	: రూ.190	రూ.270	రూ. 295
వెన్‌కాబ్(కిలో)	: రూ.200	రూ.305	రూ. 305

బంగారం ధరలు



బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.81100	రూ.74800	రూ.960

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్.. వేణుమాల్

స్క్రీన్-1 : అమరన్ (12.00, 3.30, 7.00, 10.30)
స్క్రీన్-2 : మెకానిక్ రాకీ (11.45, 3.00, 6.15, 9.30)
స్క్రీన్-3 : మందిర (10.45)
: కనక మహాలక్ష్మి (1.30)
: క (4.00)
: జీబ్రా (7.15, 10.40)
స్క్రీన్-4 : లక్కీ భాస్కర్ (1.00, 7.05)
: దేవకినందన వసుధేవ (4.15, 10.20)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : మెకానిక్ రాకీ (10.30, 10.20)
: దేవకినందన వసుదేవ (1.30, 7.30)
: లక్కీ భాస్కర్ (4.30)
స్క్రీన్-3 : అమరన్ (10.20, 7.30, 10.30)
: జీబ్రా (1.30)
: మెకానిక్ రాకీ (4.30)



దేవి : మెకానిక్ రాకీ (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్ : అమరన్ (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్ : కంగువా (3డి తెలుగు) (11.15, 2.15, 6.15, 9.15)
లలితామహాల్: దేవకినందన వసుధేవ (11.15, 2.15, 6.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్